



# విశ్వంవాయిస్

అవినీతిపై - అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 176 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 19 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


# ఏపీలో దివ్యాంగులకు ఉచిత బస్సు

## ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. గుంటూరు జిల్లా మంగళగిరి బస్టాండ్‌లో దీన్ని ప్రారంభించిన అనంతరం దివ్యాంగులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. డాన్‌బాస్కో స్కూల్ మీదుగా డోలాస్ నగర్, ప్రకాశ్‌నగర్, నులకపేట, ఉండవల్లి సెంటర్ మీదుగా పెనుమాక వెళ్లారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి బాగోగుల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. వారి భోజన సదుపాయాలపై ఆరా తీశారు. పథకం ప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు తరలివచ్చారు.

ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తు

## గడువు పొడిగింపు

- ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 24 వరకు అవకాశం
- వివిధ దశల్లో ఆలస్య రుసుముతో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 11 నుంచి 13 వరకు దరఖాస్తుల్లో సవరణకు అవకాశం




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీసెట్ రెండు వేల ఇరవై ఆరు పరీక్షకు సంబంధించిన దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని మిగతా .. 2లో..

నివాస భవనాల్లో

## అగ్ని ప్రమాదాలు..

17 మంది మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీ, ఇండోర్ లలోని పలు నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడంతో 17మంది మృతి చెందారు. దిల్లీలోని పాలం ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పిల్లలతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. మంటల నుంచి మిగతా .. 2లో..

రాజకీయాల్లో

## పదవీ విరమణ ఉండదు

రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజకీయ ప్రస్థానంలో పదవీ విరమణ అనేది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని, ప్రజా సేవలో ఎప్పుడూ విరామం ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ సభను వీడుతున్న వారు సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషిని నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో జరిగిన సుదీర్ఘ చర్చలు, విభిన్న అభిప్రా యాలు అన్నీ భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటుతాయని మిగతా .. 2లో..

రజనీకాంత్‌పై వ్యాఖ్యలు..

## క్షమాపణలు చెప్పిన టీవీకే నేత



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ నటుడు రజనీకాంత్ రాజకీయ ప్రయత్నాలపై వ్యాఖ్యలు చేసిన టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ అదవ్ అర్జున వివాదంలో చిక్కుకున్నారు. తాజాగా ఆయన రజనీకి క్షమాపణలు చెప్పారు. ఆయనను కించపరిచే ఉద్దేశం తనకు లేదని వివరణ ఇచ్చారు. బుధవారం తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో మాట్లాడారు. "నా నాయకుడు (విజయ్)కు నాయకుడైన రజనీకాంత్‌ను కించపరిచే ఉద్దేశం నాకు ఏమాత్రం లేదు. అది డీఎంకే కుట్ర అని మాత్రమే నేను మిగతా .. 2లో..

ఏపీలోని పలు జిల్లాలకు పిడుగుపాటుతో కూడిన

## వర్షాల హెచ్చరిక

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాగల మూడు గంటల్లో పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోనసీమ, సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం మిగతా .. 2లో..

త్వరలో విశాఖ రైల్వే జోన్

## కార్యకలాపాలు ప్రారంభం

రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు మిగతా .. 2లో..










(మొదటిపేజీ తరువాయి)

### ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తు

# గడువు పొడిగింపు

విద్యార్థులకు ఇది ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల ఇరవై నాలుగు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు సెట్ కన్వీనర్ మోహనరావు తెలిపారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలస్య రుసుముతో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని అధికా రులు కల్పించారు. వెయ్యి రూపాయల ఆలస్య రుసుముతో మార్చి ఇరవై ఎనిమిది వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రెండు వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులకు అదనపు సమయం లభించింది. అదేవిధంగా నాలుగు వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ ఆరు వరకు, పది వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ పది వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కన్వీనర్ వివరించారు. ఈ గడువులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తైన తర్వాత అప్లికేషన్ ఫారమ్‌లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. ఏప్రిల్ పదకొండు నుంచి పదమూడు వరకు అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు మరియు దరఖాస్తు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. గడువు పొడిగింపును ఉపయోగించుకుని విద్యార్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### రాజకీయాల్లో

# పదవీ విరమణ ఉండదు

ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్క సభ్యుని అనుభవం ఎంతో విలువైనదని, ఆ అనుభవ పాఠాలు ఎన్నటికీ వృథా కావని మోదీ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు.. హెచ్‌డీ దేవెగౌడ, శరద్ పవార్, మల్లిఖార్జున ఖర్గే వంటి సీనియర్ నేతల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. దశాబ్దాల కాలం పాటు పార్లమెంటరీ సేవలో గడిపిన వీరి జీవితాలు యువ నాయకులకు మార్గదర్శకాలని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తనదైన శైలిలో చమత్కరిస్తూ.. దేవెగౌడ గారితో తనకున్న 54 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు" అని ఖర్గే అనడంతో సభలో నవ్వులు పూశాయి. రాజకీయాల్లో ఉన్నవారు అలసిపోరని, దేశం కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 26 మంది ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, మిగిలిన స్థానాలకు పోలింగ్ ద్వారా అభ్యర్థులు విజయం సాధించారు.

### నివాస భవనాల్లో

# అగ్ని ప్రమాదాలు..

తప్పించుకోవడానికి భవనం పైనుంచి దూకిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మరో ఘటనలో ఇండోర్‌లోని ఓ నివాస భవనం బయట ఉన్న ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పాయింట్ పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ముగ్గురు వ్యక్తులను మంటల నుంచి కాపాడి ఆస్పత్రికి తరలించామన్నారు. కారు ఛార్జ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. మంటలు భవనంలోకి వ్యాపించడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలినట్లు అధికారులు తెలిపారు. దీంతో మంటలు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఈవీ ఛార్జింగ్ పాయింట్ పేలడానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

### రజనీకాంత్‌పై వ్యాఖ్యలు..

# క్షమాపణలు చెప్పిన టీవీకే నేత

చెప్పాను. బహుశా.. ఆయన నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని ఉండొచ్చు. రజనీకాంత్ బాధపడి ఉంటారని ఆయన మాటలను బట్టి తెలు స్తోంది. కానీ అక్కడ నా ఉద్దేశం వేరు. ఈ వ్యవహారం విచారాన్ని కలిగించింది" అని అర్జున క్షమాపణలు కోరారు. "నాకు చాలా చిన్నవయసులోనే ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వర్తించే అవకాశం వచ్చింది. రజనీ తన రాజకీయ ప్రవేశం గురించి ప్రకటించిన వెంటనే 18 శాతం ఓటర్లు ఆయనవైపు మళ్లినట్లు అప్పట్లో సర్వేలు వెల్లడించినట్లు గుర్తించాను. అదొక గొప్ప విషయం. ఆ గణాంకాలు రజనీకాంత్ ప్రత్యర్థుల్లో భయాన్ని సృష్టించాయి" అని తమిళనాడులోని రాజకీయ పార్టీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇటీవల అర్జున ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రజనీ రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నించిన సమయంలో డీఎంకే పార్టీ ఆయనపై బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో తాను నటుడిపై విమర్శలు చేయాలనుకోవట్లేదని, ఇలాంటి ఒత్తిళ్లకు తమ నేత విజయ్ తలొగ్గరని చెప్పడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే నేతలు ఖండించారు. అలాగే రజనీకాంత్ తీవ్రంగా స్పందించారు. "టీవీకేలో ఉన్నతస్థాయిలో ఉన్న నేత నాపై చేసిన వ్యాఖ్యలు అసత్యం. ఈ విషయంలో నేను చెప్పేది ఒక్కటే.. కాలం మాట్లాడకపోవచ్చు కానీ, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తుంది" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే.

# వర్షాల హెచ్చరిక

ఉన్నట్లు చెప్పింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. మరోవైపు గన్నవరం విమానాశ్రయంలో భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి. దిల్లీ నుంచి విజయవాడ వచ్చిన ఇండిగో విమానం.. ప్రతికూల వాతావరణంతో ఇక్కడ దిగలేదు.

### త్వరలో విశాఖ రైల్వే జోన్

# కార్యకలాపాలు ప్రారంభం

పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు.

### సెవెన్ సమ్మిట్స్ ఛాలెంజ్‌లో

# తెలుగు తేజం ప్రపంచ రికార్డ్..

## గిన్నిస్ బుక్ ఎక్కిన అన్మిష్ వర్మ




విశాఖపట్నం తీరం నుంచి ప్రపంచ శిఖరాల వరకు.. అన్మిష్ వర్మ ప్రయాణం అద్భుతం..! ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన అగ్నిపర్వతాలను అతి తక్కువ సమయంలో అధిరోహించిన ఆయన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఢిల్లీలో జరిగిన వేడుకలో ఈ ప్రతిష్టాత్మక ధృవీకరణ పత్రాన్ని అందుకుని భారత్ గర్వించేలా చేశారు. భారత సాహస యాత్రికుడు, విశాఖపట్నానికి చెందిన భూపతిరాజు అన్మిష్ వర్మ సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏడు ఖండాలలోని ఎత్తైన అగ్నిపర్వత శిఖరాలను అతి తక్కువ కాలంలో అధిరోహించిన 'ఫాస్టెస్ట్ మేల్'గా ఆయన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు పొందారు. మార్చి 17 రాత్రి 8 గంటలకు ఢిల్లీలోని వినయ్ మార్గ్ లో ఉన్న సిఐఐ వేదికగా జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ ప్రతినిధి రిషి నాథ్ చేతుల మీదుగా అన్మిష్ ఈ అధికారిక సర్టిఫికేట్‌ను అందుకున్నారు.సరిహద్దులు లేని సాహస యాత్ర.. అన్మిష్ వర్మ ప్రయాణం కేవలం అగ్నిపర్వతాలకే పరిమితం కాలేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించడమే కాకుండా, ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వత శిఖరాలను కూడా ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. అంతేకాకుండా, మంచుతో గడ్డకట్టిన అంటార్కిటికా ఖండంలోని దక్షిణ ధృవానికి స్కీయింగ్ చేస్తూ చేరుకుని తన పట్టుదలను ప్రపంచానికి చాటి చెప్పారు. ఒక మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ నుంచి అంతర్జాతీయ పర్వతారోహకుడిగా ఆయన ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకం.


### మదనపల్లె ఫైల్స్ దహనం కేసు..

# పెద్దిరెడ్డి పీఏ, ప్రధాన అనుచరుడు అరెస్ట్



**చంద్రగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించిన ముని తుకారాం, ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాయకులతో కలిసి కాఫీ తాగేందుకు వచ్చిన ఇరువురిని చంద్రగిరి మండలం పనపాకం టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21న ఫైల్స్ తగులబెట్టారు. ఈ కేసులో ఏ3గా మాధవరెడ్డి, ఏ4గా ముని తుకారాం ఉన్నారు. ఈ ఇద్దరు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇటీవల వారికి అక్కడ చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు బుధవారం వారిని అరెస్ట్ చేశారు.

# విశాఖకు రింగ్ రోడ్డు...భారీ గిఫ్ట్ !




భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి విశాఖ రావాలంటే హెవీ ట్రాఫిక్ ఉంది. దాంతో గంటన్నరకు పైగా సమయం పడుతోంది. ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీస్ లో విశాఖ ముందు వరసలో ఉంది. దానికి భౌగోళికమైన పరిస్థితులు కారణం. విశాఖకు అతి పెద్ద తీర ప్రాంతం ఉంది. పచ్చని కొండలు ఉన్నాయి. ప్రకృతి రమణీయత ఉంది. అలాగే రూరల్ అర్బన్ రెండూ కలగలసిన నేపథ్యం ఉంది. సీ పోర్టు ఎయిర్ పోర్టు రైల్వే రోడ్ కనెక్టివిటీ ఉండడంతో ఏపీలో ప్రస్తుతం అతి పెద్ద నగరంగా ఉంది. విశాఖను ఎవరూ విస్మరించలేని విధంగా సిటీ ప్రగతి ఉంది. ఐటీ హబ్ గా పారిశ్రామిక ముఖ్య కేంద్రంగా విశాఖ అవతరిస్తోంది. భోగాపురం ఎయిర్ పోర్టు ఆపరేషన్స్ మొదలైతే కనుక విశాఖ అభివృద్ధి మరింతగా జోరు అందుకుంటుంది అన్న మాట సైతం గట్టిగా వినిపిస్తోంది.

**రింగ్ రోడ్ ప్లాన్ తో :** విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రింగ్ రోడ్ కి ప్లాన్ చేస్తున్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి రాంబిల్లి నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్ బేస్ వరకూ దాదాపుగా 70 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతం వరకూ రింగ్ రోడ్ ని నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది అని అంటున్నారు. ఈ రింగ్ రోడ్ పరిధిలోకి భోగాపురం, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం రాంబిల్లి వస్తాయి.

**ట్రాఫిక్ ని కంట్రోల్ చేయాలంటే :** భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి విశాఖ రావాలంటే హెవీ ట్రాఫిక్ ఉంది. దాంతో గంటన్నరకు పైగా సమయం పడుతోంది. దాంతో ఈ ట్రాఫిక్ ని కంట్రోల్ చేయాలంటే రింగ్ రోడ్ అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో కొత్తగా ప్లాన్ చేస్తున్న రింగ్ రోడ్ అంతా రూరల్ రూట్ లో సాగుతుంది. దాంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని అంటున్నారు. ఉత్తరాంధ్రా జిల్లాలు సైతం అభివృద్ధి చెందేందుకు ఈ విధంగా అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ రింగ్ రోడ్ ప్రగతికి అతి పెద్ద కీలకమైన మలుపుగా ఉంటుందని కూడా భావిస్తున్నారు.

**రియల్ బూమ్ సైతం :** ఇక ఈ రింగ్ రోడ్ డిజైన్ చేసిన తీరుని బట్టి చూస్తే రూరల్ సెక్టార్ అంతా మహర్దశను అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అంతే కాదు రానున్న రోజులలో మారు మూలన ఉన్న ప్రాంతాలు సైతం మెయిన్ జంక్షన్లుగా మారుతాయని అంటున్నారు. అలా రియల్ బూమ్ ఊపందుకుంటుంది అని లెక్క వేస్తున్నారు. అదే సమయంలో పారిశ్రామిక అభివృద్ధికి కూడా వీలు కల్పిస్తుందని అంటున్నారు. ఒక విధంగా ట్రాఫిక్ ని కంట్రోల్ చేసే ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ ని డెవలప్ చేయడానికే ఈ రింగ్ రోడ్ పరిమితం కాదని బహుముఖంగా అభివృద్ధికి బాటలు వేస్తుందని భావిస్తున్నారు.

**భోగాపురం టూ రాంబిల్లి :** భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాంబిల్లి దాకా రింగ్ రోడ్ ద్వారా కనెక్టివిటీ ఇవ్వడం వల్ల రాంబిల్లి ప్రాంతంలో ఉన్న రక్షణ కేంద్రాలు అలాగే పారిశ్రామిక సంస్థలకు కూడా ఎయిర్ పోర్టుని అనుసంధానించినట్లు అవుతుందని చెబుతున్నారు. అంతే కాదు ఐటీ ఫార్మా సెక్టార్ తో పాటు పారిశ్రామిక రంగానికి ఈ రింగ్ రోడ్ అతి పెద్ద బూస్ట్ ఇస్తుందని చెబుతున్నారు. అపుడు విశాఖ నగరం వైపు ట్రాఫి తగ్గి రింగ్ రోడ్ మెయిన్ రూట్ అవుతుందని ఆ విధంగా సిటీ మీద ఒత్తిడి తగ్గుతుందని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే విశాఖకు రింగ్ రోడ్ రూపంలో ఒక భారీ గిఫ్ట్ ని కూటమి ప్రభుత్వం రెడీ చేస్తోంది అని చెబుతున్నారు.

# 5 గంటల విచారణలో 38 ప్రశ్నలు..

## వైసీపీ ఎమ్మెల్సీ సతీమణి



రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు.. జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు విషయంలో తాజాగా విచారణను ఎదుర్కొన్నారు వైసీపీ ఎమ్మెల్సీ సతీమణి లక్ష్మీదుర్గ. ఈ హత్యకేసును విచారిస్తున్న సిట్ అధికారుల నోటీసుతో విచారణకు ఆమె హాజరయ్యారు. మంగళవారం ఉదయం 10.20 గంటలకు మొదలైన విచారణ దాదాపు 5 గంటల పాటు సాగింది. మొత్తం 38 ప్రశ్నలు సంధించగా.. అందులో అత్యధిక ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది.

విచారణ సందర్భంగా ఆమె ఎదుర్కొన్న ప్రశ్నల్ని చూస్తే..

– మీ దగ్గర డ్రైవర్ గా పని చేసి మానేసిన సుబ్రహ్మణ్యం హత్యకు ముందు.. ఆ తర్వాత మీద భర్త అనంతబాబు ప్రవర్తన ఎలా ఉంది?

– ఆ రోజు హత్య జరిగిన డంపింగ్ యార్డుకు మీ భర్తతో కలిసే వెళ్లారా?

– ఆ రాత్రి కారులో ఎవరెవరు తిరిగారు?

– ఆ కారు ఎవరిది?

– మీరు వాడుతున్న సిమ్ కార్డు మీ పేరు మీద ఎందుకు లేదు?

– హత్య జరిగినప్పుడు మీ తమ్ముడ్ని చూసేందుకు ఆసుపత్రికి వెళ్లారని చెప్పారు కదా? ఆ రోజు అక్కడ మీతో పాటు ఎవరు ఉన్నారో చెబుతారా?

ఈ తరహాలో పలు ప్రశ్నలు అడిగినా.. మౌనంతో ఉండటం లేదా ముక్తసరిగా సమాధానం చెప్పినట్లుగా తెలుస్తోంది. చాలా ప్రశ్నలకు తెలీదు.. గుర్తు లేదు.. అంటూ ఆమె తన సమాధానాల్ని సరిపెట్టినట్లుగా చెబుతున్నారు. హత్య జరిగిన సమయంలో తాను అక్కడ లేనన్న విషయాన్ని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. డ్రైవర్ హత్య జరిగిన సమయంలో లక్ష్మీ దుర్గ అక్కడే ఉన్నట్లుగా పోలీసులు పూర్తి ఆధారాలతో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేయటంతో ఆమెను ఏ2గా చేర్చారు. ఈ సందర్భంగా ఆమె కొన్ని రోజులు అండర్ గ్రౌండ్ లోకి వెళ్లారు. సిట్ అధికారుల విచారణలో భాగంగా అండర్ గ్రౌండ్ కు వెళ్లిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఎక్కడకు వెళ్లారు? ఎందుకు వెళ్లారు? ఎవరు ఆమెతో ఉన్నారు? లాంటి ప్రశ్నలకు సమాధానాల్ని ముక్తసరిగా చెప్పినట్లు తెలిసింది. గడిచిన రెండురోజులుగా విచారణకు హాజరవుతున్న సందర్భంగా ఆమె అనుచరులు అవసరానికి మించి హడావుడి చేసినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె విచారణకు వచ్చే వేళలోనూ.. తిరిగి వెళ్లే వేళలోనూ కుటుంబ సభ్యులు.. అనుచరుల హడావుడి ఒక రేంజ్ లో ఉన్నట్లుగా చెబుతున్నారు. కారులో ఆమె వచ్చినట్లుగా క్రియేట్ చేసి.. అందుకు భిన్నంగా స్కూటీ మీద తీసుకొచ్చి.. తీసుకెళ్లటం గమనార్హం. ఆమె బంధువులు ఆమెను స్కూటీ మీద తీసుకెళ్లినట్లుగా ప్రత్యక్ష సాక్ష్యుల చెబుతున్నారు. విచారణ జరుగుతున్న సమయంలో ఎవరు వస్తున్నారు? ఎవరెవరు అక్కడ ఉన్నారు? లాంటి అంశాల మీద వైసీపీ ఎమ్మెల్సీ అనుచరులతో పాటు.. కాకినాడ వైసీపీ నేత.. మాజీ ఎమ్మెల్యే అనుచరులు కూడా కాపలా కాసినట్లుగా తెలుస్తోంది.

# షర్మిల షాకింగ్ కామెంట్స్..

## బాబాయ్ హత్యకు అసలు కారణం ఇదే..



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప ఎంపీ టికెట్ విషయంలోనే వివేకా హత్య జరిగిందని షర్మిల ఆరోపించారు. కడప ఎంపీ పదవికి అవినాశ్ రెడ్డి సరైన వ్యక్తి కాదని బాబాయ్ వివేకానందరెడ్డి తనతో స్వయంగా చెప్పారని షర్మిల వివరించారు. బాబాయ్ ఎంత చెప్పినా, అవినాశ్ కే జగన్ టికెట్ ఇచ్చారన్నారు. బాబాయ్ బతికి ఉంటే తనకు ఎప్పటికైనా అడ్డేనని ఎంపీ అవినాశ్ భావించారని షర్మిల వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా షర్మిల విశాఖ జిల్లాలో పర్యటించారు. వివేకా హత్యపై పీసీసీ చీఫ్ షర్మిల తాజాగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. వివేకానందరెడ్డి ఏడో వర్ధంతి రెండు రోజుల క్రితమే ముగిసింది. అయినా ఈ హత్య కేసుపై పెద్దగా పురోగతి లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు సంస్థ సరిగా వ్యవహరించలేదని, ఇంకా కొందరి పాత్రపై అనుమానాలను నివృత్తి చేయలేదని వివేకా కుమార్తె వైఎస్ సునీతారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు కొనసాగించమని ఆమె చేస్తున్న న్యాయపోరాటం విఫలయత్నమే అవుతోంది. ఈ నేపథ్యంలో వివేకా హత్య కేసుపై షర్మిల మరోసారి నోరు విప్పడం సంచలనంగా మారింది. వివేకా హత్యకు సంబంధించి ఆయన కుమార్తె, తన సోదరి వైఎస్ సునీత చేస్తున్న పోరాటానికి తొలి నుంచి షర్మిల మద్దతు చెబుతున్నారు. ఈ విషయమై పలుమార్లు బహిరంగంగా షర్మిల వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ తోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి టార్గెట్ గా షర్మిల తరచూ చేస్తున్న విమర్శలు రాజకీయంగా పెను దుమారం రేపుతున్నాయి. వివేకాను హత్య చేసిన వారిని తాను అన్నా అని పిలిచిన వారే కాపాడుతున్నారని గతంలో షర్మిల ఆరోపించారు. పరోక్షంగా మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని టార్గెట్ చేశారని అంటున్నారు. ఇక తాజాగా కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని పేరు ప్రస్తావిస్తూ షర్మిల చేసిన విమర్శలు కాకరేపుతున్నాయి. కడప ఎంపీ టికెట్ కోసమే హత్య జరిగిందంటూ షర్మిల వ్యాఖ్యానించడంతో వైసీపీని మాజీ సీఎం జగన్ ను మరోమారు ఈ వ్యవహారంలోకి షర్మిల లాగారాని చెబుతున్నారు. హత్య కేసులో సాక్షులు చనిపోతున్నారని, సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని ఆమె గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. తన చిన్నాన్న కుమార్తె సునీతారెడ్డి పోరాటానికి మద్దతుగా ఉంటానని, న్యాయం జరిగే వరకు వదిలిపెట్టబోమని అప్పట్లో స్పష్టం చేశారు. అయితే హత్య కేసు దర్యాప్తును ముగించినట్లు సీబీఐ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత సునీత ఆందోళన వ్యక్తం చేయడం, ఇప్పుడు షర్మిల కూడా ఆమెకు బాసటగా నిలుస్తున్నట్లు మాట్లాడటం రాజకీయ ప్రాధాన్యాంశంగా చెబుతున్నారు. నిందితులను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలనే ఆలోచనతో షర్మిల ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అనుమానిస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఆ 'సరదా'నే ఎంపీ కొంత ముంచిందా?!

మొయినాబాద్ డ్రగ్స్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కు నలుగురి లో కలవడం.. నలుగురితో సరదాగా ఉండడం అలవాటని ఆయన కుటుంబం చెబుతోంది. ఫస్ట్ టైమ్ ఎంపీ కావడంతోపాటు.. ఇలాంటి అలవాట్లు కూడా.. ఎప్పుడూలేవని చెబుతున్నారు. ముఖ్యంగా రాజకీయ ప్రాధాన్యం ఉన్న కుటుంబం నుంచి పుట్టా వచ్చారు. ఆయన తండ్రి పుట్ట సుధాకర్ యాదవ్.. 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. టీటీడీ చైర్మన్‌గా కూడా చేశారు.

ఇక, పుట్టా మహేష్ సొంత మామ.. యనమల రామకృష్ణుడు 40 ఏళ్లకుపైగానే ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా రు. మంత్రిగా కూడా పనిచేశారు. ఇలాంటి ఫ్యామిలీ నుంచి వచ్చిన మహేష్‌కు నిజంగానే చెడు అలవాట్లు ఉన్నట్టుగా ఎక్కడా ఇప్పటి వరకు లేదు. అయితే.. ఆయన తరచుగా అందరినీతోనూ కలివిడిగా ఉంటా రన్న పేరుంది. స్నేహితులను పెంచుకోవడం.. వారి కుటుంబాల్లో జరిగే ఫంక్షన్లలో పాల్గొనడం అంటే.. మహా సరదా అని చెబుతున్నారు.

ఇదే ఉద్దేశంతో ఆయన తాజాగా రోహిత్‌రెడ్డి ఇచ్చిన విందుకు కూడా హాజరయ్యారని ఒక టాక్ నడుస్తోంది. ఇదే విషయాన్ని పుట్టా కూడా పదే పదే చెబుతున్నారు. సెల్ఫీ వీడియోలోను, అదేవిధంగా తాజాగా ఇచ్చిన ప్రకటనలోనూ ఆయన ఇదే విషయాన్ని చెప్పారు. తనకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని అంటున్నారు. అయితే.. రోహిత్‌రెడ్డితో ఆయన పాల్గొన్న పార్టీపై విమర్శలు రావడం.. డ్రగ్స్ వినియోగించారన్న అభియో గం ఎదుర్కోవడంతో ఇప్పుడు చిక్కుల్లో పడాల్సి వచ్చింది.

వాస్తవానికి పుట్టా పనితీరును గమనిస్తే.. ఏలూరు ఎంపీగా ఆయన దూకుడుగానే ఉన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్లమెంటులోనూ.. మంచి గళం వినిపిస్తున్నారు. వివాద రహితుడిగా గత 22 మాసాలుగా ఆయన పేరు తెచ్చుకున్నారు. పార్టీ పరంగానే కాదు.. వ్యక్తిగతంగా కూడా సౌమ్యుడన్న పేరు తెచ్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎంపీగా కూడా పేరుంది. కానీ, ఆ చిన్న సరదానే ఇప్పుడు



వ్యక్తిగతంగా ఆయనపై మరకలు పడేలా చేసింది. ఈ విషయంలో పార్టీ పరంగా.. కూడా ఆయన గురించి ఆలోచన చేస్తున్నారు. చివరకు ఏం చేస్తారో చూడాలి.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## అక్షర చిట్ ఫండ్ చైర్మన్ అరెస్టు



**ఆదిలాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** చిట్టీల పేరిట డిపాజిట్లు సేకరించి మోసానికి పాల్పడిన అక్షర చిట్‌ఫండ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన శ్రీనివాసరావు 2009లో సొంతంగా చిట్‌ఫండ్ వ్యాపారం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చిట్టీ స్కీంలను ప్రారంభించారు. వందల మంది నుంచి భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించారు. గడువు ముగిసిన తర్వాత ఖాతాదారులకు తిరిగి డబ్బులు చెల్లించకుండా ఆర్థిక మోసాలకు పాల్పడ్డారు. ఆదిలాబాద్ టూటౌన్ పరిధిలోనే 12 కేసులు నమోదవగా బాధితులకు రూ.1.11కోట్లు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో 96 చీటింగ్ కేసులు నమోదు కావటంతో ఆరు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఆదిలాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. శ్రీనివాసరావుకు కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌లో ఆస్తులు ఉన్నాయని.. వాటిలో ఇప్పటికే కొన్ని జప్తు కాగా మిగతా వాటిని కూడా చట్టపరంగా జప్తునకు చర్యలు తీసుకుంటామన్నారు.

## అప్పుల బాధతో కొడుకు.. అతడి మృతిని తట్టుకోలేక తల్లి..



**జగిత్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** జగిత్యాల అర్బన్ మండలం మోతెలో విషాదం నెలకొంది. తల్లి, కొడుకు ఒకే రోజు మృతి చెందారు. గ్రామానికి చెందిన దొడ్ల సంపత్ (25) అనే యువకుడు అప్పుల బాధతో మంగళవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొడుకు మృతితో ఏడుస్తూ అతడి తల్లి మల్లవ్వ (60) గుండెపోటు వచ్చి కుప్పకూలింది. అదే ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## అక్కను చంపి.. ముక్కలు చేసి.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం

**అబ్దుల్లాపూర్‌మెట్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పుర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.

## తాడిపత్రిలో నవవధువు ఆత్మహత్య



**తాడిపత్రి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లాలో ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. తాడిపత్రిలోని గన్నవారిపల్లె కాలనీలోని నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని లక్ష్మీప్రసన్న(30) బలవన్మరణానికి పాల్పడింది. తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న ఆమెకు.. గత నెలలో కర్ణాటకలోని కోలార్ జిల్లా నివాసి విజయ్ కుమార్‌తో వివాహం జరిగింది. పెళ్లికి ముందే ఒకసారి ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించగా.. తల్లి దండ్రులు రక్షించారు. గురువారం అత్తగారింటికి వెళ్లాల్సి ఉండగా.. ఆమె ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనం



**మడికొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనమయ్యారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతులను తండ్రి రాజశేఖర్ (54), కుమార్తె రాజశ్రీ (24)గా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా అల్లుడు ప్రవీణ్ వారిద్దరినీ చంపినట్లు సమాచారం. సమాచారం అందుకున్న మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు. ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మోసపోయి.. అదే విధానంలో మోసగించి..

**3,880 మందిని బురిడీ కొట్టించిన ప్రధాన నిందితుడు సహా పలువురి అరెస్టు**

నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు. చిత్రంలో వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు




**రాజేంద్రనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ వ్యక్తి.. తాను మోసపోయిన విధానంలోనే ఇతరుల్ని బురిడీ కొట్టించాలనుకున్నాడు. అలా వేల మందిని మోసం చేస్తూ తేలిగ్గా డబ్బు సంపాదించడం ప్రారంభించాడు. శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఈ మోసాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు విజయ్‌కుమార్‌తోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కర్ణాటకకు చెందిన విజయ్‌కుమార్ లాక్‌డౌన్ సమయంలో తక్కువ ధరకు స్మార్ట్‌ఫోన్ లభిస్తోందని ఓ ఫోన్‌కాల్ రావడంతో స్పందించాడు. ఫోన్ ఆర్డర్ ఇచ్చాడు. డబ్బులు చెల్లించిన తర్వాత అతడికి ఫోన్ స్థానంలో బ్లూటూత్ స్పీకర్లు వచ్చాయి. అలా మోసపోయిన అతడు అదే విధానంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. 2021లో బెంగళూరులో ఓ యాప్‌ను సృష్టించి టెలికాలర్లను నియమించుకున్నాడు. తన వ్యాపారాన్ని బీదర్, హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్, హైదర్‌గూడలకు విస్తరించాడు. బెంగళూరుకు చెందిన మంజులకు రూ.10 వేలు చెల్లించి లక్ష నంబర్లు సేకరించాడు. ఆయా ప్రాంతాల్లో కార్యాలయాలను ప్రారంభించి తక్కువ ధరకే మొబైల్ ఫోన్లు లభిస్తాయని టెలికాలర్ల ద్వారా ఫోన్లు చేయిస్తున్నాడు. ఫోన్ అందిన తర్వాతే డబ్బులు చెల్లించాలని చెబుతుండటంతో చాలా మంది తేలిగ్గా నమ్మేవారు. ఆర్డర్ ఇచ్చిన వారికి ఫోన్ లాంటి చిన్న వస్తువును పార్సిల్‌లో పంపేవాడు. కస్టమర్లు డబ్బులు చెల్లించాక.. ఆ పార్సిల్ విప్పగా.. గ్లాసులు, బ్లూటూత్ స్పీకర్ల లాంటివి ఉండేవి. నిందితుడు కాటేదాన్‌లో ఓ గోదాం ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పార్సిళ్లు పంపుతున్నాడు. సమాచారం అందుకున్న శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి హైదర్‌గూడలోని కార్యాలయంపై దాడులు నిర్వహించారు. ఇప్పటి వరకు నిందితులు 3,880 మందిని మోసగించినట్లు గుర్తించారు. నిందితుల నుంచి రూ.1.40 లక్షల నగదు, 50 సిమ్‌కార్డులు, ల్యాండ్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విజయ్‌కుమార్‌తోపాటు అతనికి సహకరించిన శివకుమార్, మోదిన్, శశికాంత్‌లను రిమాండ్‌కు తరలించారు.

## తుపాకీతో స్టంట్.. గుండెల్లోకి దూసుకెళ్లిన తూటా

**రీల్స్ మోజులో ప్రాణాలు కోల్పోయిన ఓ యువకుడు**



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జనంలో రీల్స్ పిచ్చి రోజు రోజుకూ పెరిగిపోతోంది. వ్యూస్ కోసం కొందరు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. తాజాగా దిల్లీలోని న్యూ అశోక్‌నగర్‌లో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. లోడ్ చేసిన గన్‌తో రీల్స్ చేస్తుండగా.. అది పేలి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని తూర్పు దిల్లీలోని దల్లుపుర గ్రామానికి చెందిన పవన్ కుమార్ (28)గా గుర్తించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పవన్ రీల్ చేస్తుండగా పక్కనున్న సమీప బంధువు హిమాన్ష్ దాన్ని రికార్డ్ చేశాడు. బటన్ ఎలా నొక్కాలో మిత్రుడు చెబుతుంటే.. పవన్ తుపాకీని లోడ్ చేశాడు. ఆ తర్వాత గన్‌ను ఛాతీకి గురిపెట్టుకొని కెమెరా వైపు చూసి నవ్వాడు. వీడియో రికార్డు చేస్తున్న వ్యక్తి 'కాల్చొద్దు అన్నా..' అని చెప్పినప్పటికీ.. పవన్ కంగారులో ట్రిగ్గర్ నొక్కేశాడు. దీంతో బుల్లెట్ గుండెల్లోకి దూసుకెళ్లి.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ తుపాకీ హిమాన్షుదేనని పోలీసులు తెలిపారు. దానికి లైసెన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు.

# ఉగాది పండుగని ఏయే రాష్ట్రాల వారు ఎలా జరుపుకుంటారో తెలుసా..?

భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయం. అందుకే ఒకే పండుగను దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో, రకరకాల ఆచారాలతో జరుపుకుంటారు. ఉగాది పండుగ తెలుగు వారికే కాకుండా, దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల వారికి కూడా నూతన సంవత్సరం. ఖగోళ శాస్త్రం ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించే సమయాన్ని ఈ పండుగగా జరుపుకుంటారు. రాష్ట్రాల వారీగా ఈ పండుగను జరుపుకునే తీరు ఇక్కడ ఉంది.

**1. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (ఉగాది):** తెలుగు రాష్ట్రాల్లో ఉగాది వేడుకలు చాలా వైభవంగా జరుగుతాయి. ఈ పండుగ ప్రత్యేకత షడ్రుచుల సమ్మేళనంతో చేసే పచ్చడి. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని సూచిస్తాయి. తెలుగు వారి ఉగాది అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. ఇది కేవలం ఒక పదార్థం మాత్రమే కాదు, జీవిత సత్యాన్ని తెలిపే ఒక సందేశం. ఆరు రకాల రుచులు జీవితంలోని ఆరు భావోద్వేగాలకు ప్రతీక.

తీపి (బెల్లం): ఆనందం, సుఖానికి చిహ్నం.

చేదు (వేపపువ్వు): జీవితంలో ఎదురయ్యే బాధలు లేదా సవాళ్లకు ప్రతీక.

పులుపు (చింతపండు): నేర్పుగా వ్యవహరించాల్సిన సందర్భాలకు సంకేతం.

ఉప్పు (ఉప్పు): జీవితానికి అవసరమైన ఉత్సాహం, రుచి.

కారం (పచ్చిమిర్చి/మిరియాలు): ఆగ్రహం లేదా సహనం కోల్పోయే క్షణాలు.

వగరు (మామిడి పిందెలు): కొత్త అనుభవాలు, ఆశ్చర్యకరమైన మార్పులు.

ఉగాది రోజున ప్రజలు ఉదయాన్నే సూర్యోదయానికి ముందే లేచి, తలకు నూనె పట్టించి అభ్యంగన స్నానం చేస్తారు. ఇంటి గుమ్మాలకు పచ్చని మామిడి ఆకుల తోరణాలు, వేప ఆకులు కట్టి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి, కొత్త బట్టలు ధరించి పండుగను ప్రారంభిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ఉగాది రోజు సాయంత్రం దేవాలయాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. సిద్ధాంతకర్తలు లేదా జ్యోతిష్యులు ఆ సంవత్సరపు ఆదాయ-వ్యయాలు, రాజపూజ్య-అవమానాలు, వర్షపాతం, దేశ భవిష్యత్తును వివరిస్తారు. వ్యక్తిగత రాశి ఫలాలను తెలుసుకోవడానికి ప్రజలు దీనిని ఆసక్తిగా వింటారు. ఇక ఈ పండుగకు ముఖ్యమైన వంటకం బొబ్బట్లు (వీటినే భక్ష్యాలు లేదా పోలెలు అని కూడా పిలుస్తారు). శనగపప్పు, బెల్లంతో చేసిన పూర్ణాన్ని గోధుమ పిండిలో పెట్టి నెయ్యితో కాల్చి తయారు చేస్తారు. దీనితో పాటు పులిహోర, వడలు వంటి ఇతర రుచికరమైన వంటకాలు కూడా చేస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అధికారికంగా ఉగాది వేడుకలను నిర్వహిస్తాయి. ఈ సందర్భంగా కవి సమ్మేళనాలు నిర్వహించి, ఉత్తమ కవులను, కళాకారులను సత్కరిస్తారు. తెలుగు భాషా వైభవాన్ని చాటిచెప్పేలా సాహిత్య చర్చలు జరుగుతాయి. ఉగాది అంటే కాలం ఆరంభం. తెలుగు ప్రజలు ఈ రోజున పాత చేదు జ్ఞాపకాలను విడిచిపెట్టి, కొత్త ఆశలతో సరికొత్త ప్రయాణాన్ని మొదలుపెడతారు.




**2. కర్ణాటక (యుగాది):** కర్ణాటకలో ఉగాది పండుగను 'యుగాది' అని పిలుస్తారు. తెలుగు రాష్ట్రాల్లో లాగే కర్ణాటకలో కూడా ఈ పండుగను నూతన సంవత్సరంగా అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అయితే, అక్కడి ఆచార వ్యవహారాల్లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 'ఉగాది పచ్చడి' ఎలాగో, కర్ణాటకలో 'బేవు-బెల్ల' అంత ప్రాముఖ్యత కలిగినది.

బేవు : అంటే వేప పూత (చేదు - కష్టాలకు చిహ్నం).

బెల్ల : అంటే బెల్లం (తీపి - సుఖాలకు చిహ్నం). వీటితో పాటు మామిడి ముక్కలు, ఉప్పు, మిరియాలు కూడా కలుపుతారు. జీవితంలో వచ్చే కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని ఈ మిశ్రమాన్ని ఒకరికొకరు పంచుకుంటూ తింటారు. ఉదయాన్నే సూర్యోదయానికి ముందే లేచి, తలకు నూనె పట్టించి అభ్యంగన స్నానం చేస్తారు. ఇంటి గుమ్మాలకు తాజా మామిడి ఆకుల తోరణాలు, రంగురంగుల ముగ్గులతో (రంగోలి) అలంకరిస్తారు. కొత్త బట్టలు ధరించి దేవాలయాలను సందర్శిస్తారు. కర్ణాటక యుగాదిలో కొన్ని నోరూరించే వంటకాలు కనిపిస్తాయి. ఓబట్టు : దీనినే 'హోలిగే' అని కూడా పిలుస్తారు. ఇవి మన దగ్గర చేసే బొబ్బట్లు/భక్ష్యాలు వంటివి. వీటిని నెయ్యితో కలిపి తింటారు. చింతపండుతో చేసే పులిహోర. పాలు, బెల్లం, పప్పులతో చేసే తీపి పాయస చేస్తారు. ఇక పోతే, సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులందరూ కలిసి పురోహితుల ద్వారా ఆ ఏడాది రాశి ఫలాలు, వర్షపాతం, ఆదాయ-వ్యయాల వివరాలను (పం చాంగం) వింటారు. దీనిని 'పంచాంగ శ్రవణ' అని పిలుస్తారు. యుగాది మరుసటి రోజున కర్ణాటకలో చాలా ప్రాంతాల్లో (ముఖ్యంగా పాత మైసూర్ ప్రాంతంలో) 'హొస తొడకు' అనే పండుగను జరుపుకుంటారు. ఈ రోజున మాంసా హారులు రకరకాల మాంసపు వంట కాలు చేసుకుని విందు ఆరగిస్తారు. కొత్త సంవత్సరం మొదటి రోజున శాకాహారం తీసుకున్న వారు, రెండో రోజు ఇలా మాంసాహారంతో వేడుక చేసుకుంటారు. కర్ణాటకలో యుగాది పండుగ ప్రకృతిలో వచ్చే మార్పులను స్వాగతిస్తూ, కొత్త ఆశలతో జరుపుకునే ఒక పవిత్రమైన వేడుక.

**3. మహారాష్ట్ర (గుడి పడ్వా):** మమహారాష్ట్రలో ఉగాది పండుగను గుడి పడ్వా అనే పేరుతో అత్యంత ఉత్సాహంగా, ఒక జైత్రయాత్రలా జరుపుకుంటారు. తెలుగు వారికి ఉగాది ఎలాగో, మరాఠీ ప్రజలకు గుడి పడ్వా నూతన సంవత్సర ఆరంభం. ఈ పండుగలో అత్యంత ముఖ్యమైన ఘట్టం ఇంటి ముందు 'గుడి'ని నిలబెట్టడం ప్రత్యేక ఆకర్షణ. ఒక పొడవైన వెదురు కర్రను తీసుకుని, దానికి చివరన పట్టు వస్త్రం (సాధారణంగా ఆకుపచ్చ లేదా పసుపు రంగు) కడతారు. దానిపై వేప ఆకులు, మామిడి ఆకులు, పూల మాల, గతి (చక్కెరతో చేసిన గాజుల వంటి హారం) అమర్చుతారు. వీటన్నింటిపై ఒక రాగి లేదా వెండి కలశాన్ని బోర్లించి, ఇంటి ముఖద్వారం వద్ద లేదా కిటికీలో అందరికీ కనిపించేలా నిలబెడతారు. ఇది ఛత్రపతి శివాజీ మహారాజ్ సాధించిన విజయాలకు, చెడుపై మంచి సాధించిన గెలుపుకు (విజయ పతాకం) చిహ్నంగా భావిస్తారు. ఇక పండగ రోజు ఉదయాన్నే సూర్యోదయానికి ముందే లేచి, ఒంటికి నూనె రాసుకుని అభ్యంగన స్నానం చేస్తారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు (రంగోలి) వేసి, ద్వారాలకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు ధరించి పండుగను ప్రారంభిస్తారు. తెలుగు వారి ఉగాది పచ్చడి లాగే, వీరు కూడా వేప ఆకులు, బెల్లం, జీలకర్ర, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని ప్రసాదంగా తీసుకుంటారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని గుర్తు చేస్తుంది. మహారాష్ట్ర ఇళ్లలో ఈ రోజున కొన్ని ప్రత్యేకమైన రుచులు కనిపిస్తాయి.

పురాణ్ పోలి: శనగపప్పు, బెల్లంతో చేసే తీపి బొబ్బట్లు. దీనిని నెయ్యితో కలిపి తింటారు.

శ్రీఖండ్: పెరుగుతో చేసే తియ్యని పదార్థం. దీనిని వేడివేడి పూరీలతో కలిపి తీసుకోవడం అక్కడి సంప్రదాయం.

కణగి: కొన్ని ప్రాంతాల్లో తీపి గడ్డల (స్వీట్ పొటాటో) వంటకాలు కూడా చేస్తారు.

మహారాష్ట్రలోని ముంబై, పూణే వంటి నగరాల్లో ఉదయాన్నే భారీ శోభా యాత్రలు నిర్వహిస్తారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తలకు ఫేటా (తలపాగా) చుట్టుకుని, డోల్-తాషా (డప్పులు) వాయిస్తూ యువతీ యువకులు చేసే ప్రదర్శనలు పండుగకు కొత్త కళను తెస్తాయి. మహిళలు నౌవారి (తొమ్మిది గజాల) చీరలు కట్టి బుల్లెట్లపై ర్యాలీలు తీయడం ఇక్కడి ప్రత్యేకత. మహారాష్ట్రలో గుడి పడ్వా అనేది ఒక సాంస్కృతిక గర్వాని, కొత్త ఆశల చిగురుకు ప్రతీక.

**4. గోవా (సంవత్సర్ పడ్వో):** గోవాలో కూడా కొంకణి ప్రజలు దీనిని కొత్త సంవత్సరంగా జరుపుకుంటారు. గోవాలో ఉగాది పండుగను సంవత్సర్ పడ్వో' అనే పేరుతో చాలా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇది కొంకణి ప్రజలకు నూతన సంవత్సరం. మహారాష్ట్రలో జరుపుకునే 'గుడి పడ్వా' పద్ధతులకు ఇది చాలా దగ్గరగా ఉంటుంది. గోవాలో ప్రతి ఇంటి ముందు ఒక పొడవైన వెదురు కర్రను నిలబెడతారు. దానికి చివరన ఒక రాగి లేదా వెండి కలశాన్ని బోర్లించి, కొత్త పట్టు వస్త్రం, వేప ఆకులు, మామిడి ఆకులు, చక్కెరతో చేసిన గాజుల హారాన్ని కడతారు. దీనిని 'గుడి' అని పిలుస్తారు. ఇది విజయానికి, సంక్షేమానికి చిహ్నంగా భావిస్తారు. ఉదయాన్నే సూర్యోదయానికి ముందే లేచి, ఒంటికి నూనె రాసుకుని అభ్యంగన స్నానం చేస్తారు. కొత్త బట్టలు ధరించి, ఇల్లంతా శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు (రంగోలి) వేస్తారు. స్థానిక దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెలుగు వారి 'ఉగాది పచ్చడి' లాగే, గోవాలో కూడా వేప పూత, బెల్లం కలిపిన మిశ్రమాన్ని ప్రసాదంగా తీసుకుంటారు. జీవితంలో వచ్చే కష్టసుఖాలను (చేదు-తీపి) సమానంగా స్వీకరించాలన్నదే దీని అంతరార్థం. గోవాలో ఈ రోజున కొన్ని ప్రత్యేకమైన శాకాహార వంటకాలు చేస్తారు. పప్పులు, బియ్యంతో చేసే కాన్జీ అని పిలువబడే ఒక రకమైన ఖిచిడీ తయారు చేస్తారు. బంగాళదుంప, పూరి చేస్తారు. శ్రీఖండ్ అని పెరుగుతో చేసే తీపి పదార్థం. మన దగ్గర చేసే బొబ్బట్లు లాంటి తీపి వంటకం పురాణ్ పోలి ఇక్కడ స్పెషల్ వంటకాలు.. ఇకపోతే, దేవాలయాల్లో, కొన్ని ఇళ్లలో బ్రాహ్మణుల ద్వారా ఆ సంవత్సర ఫలితాలను (రాశి ఫలాలు) వివరించే పంచాంగ పఠనాన్ని వింటారు. దీని ద్వారా రాబోయే ఏడాదిలో తమ అదృష్టం ఎలా ఉంటుందో తెలుసుకుంటారు. మొత్తానికి, గోవాలో 'సంవత్సర్ పడ్వో' కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది కుటుంబ సభ్యులందరూ కలిసి జరుపుకునే ఒక పవిత్రమైన నూతన ప్రారంభం. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పండుగలు నిర్వహిస్తారు. ఉగాది రోజున కాకపోయినా, ఇదే సమయంలో (ఏప్రిల్ నెలలో) మరికొన్ని రాష్ట్రాల్లో కొత్త సంవత్సరం జరుపుకుంటారు.

తమిళనాడు: పుత్తాండు (ఏప్రిల్ 14న), కేరళ: విషు, పంజాబ్: బైశాఖీ, బెంగాల్: పోయిలా బైశాఖ్

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
గురువారం, 19 మార్చి 2026
www.viswamvoice.com





# కొత్తపేటలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభంలో ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగులను అన్ని విధాల ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనందిస్తుంది. దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దివ్యాంగులను అన్ని విధాల ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దివ్యాంగ శక్తి పేరుతో ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే పథకాన్ని కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మరియు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి ప్రారంభించారు. ముందుగా వారితో కలిసి బస్సులో ప్రయాణించారు అనంతరం దివ్యాంగులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. సిటీ ఆర్డినరీ,మెట్రో ఎక్స్ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, ఇప్పుడు దివ్యాంగులు ఉచిత ప్రయాణం చేయవచ్చున్నారు. 40 శాతం, అంతకంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందన్నారు. గత ఏడాది డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు వారికి ఇంద్రధనస్సు పేరిట ఆరు పథకాలు ప్రకటించారన్నారు. అందులో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కూడా ఒకటన్నారు. కేవలం రెండు నెలల్లోనే ఇచ్చిన హామీని అమలుల్లోకి తీసుకువచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఈ పథకంతో రాష్ట్రంలో 11 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దివ్యాంగులకు మొదటి నుంచి టీడీపీనే ప్రాధాన్యత ఇస్తుందనీ, దివ్యాంగుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదన్నారు. టీడీపీ దివ్యాంగుల కోసం అమలుచేసిన ప్రత్యేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అమలు చేసినట్లే దివ్యాంగులకూ ప్రత్యేక రాయితీ రుణాలు పథకం అమలు చేసిందన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా టీడీపీ అమలు చేసిన రాయితీ రుణాలు మంజూరు ప్రక్రియను జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే నిలిపివేశారనీ, ఈ నిర్ణయం దివ్యాంగుల్లో తీవ్ర అసంతృప్తిని నింపిందన్నారు. టీడీపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి రాగానే 40 శాతం నుంచి 79 శాతం వరకు వైకల్యం ఉన్న దివ్యాంగులకు అప్పటివరకు అందుతున్న రూ.500 పింఛన్ రూ. 1000కి పెంచిందనీ, 90 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి రూ.1500 చేసిందనీ 2019లో 79 శాతం లోపు వైకల్యం ఉన్న వారికి రూ.2 వేలు, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి రూ.3 వేలు చొప్పున అందించిందన్నారు. ఇలా ఐదేళ్ల వ్యవధిలో దివ్యాంగుల పింఛన్ మొత్తా రూ.500 నుంచి రూ.2వేలు, రూ.3వేలకు పెంచడంతో కొందరికి 300 శాతం, మరికొందరికి 500 శాతం లబ్ధి చేకూరిందన్నారు. 2019 జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే వైకల్య శాతంతో పని లేకుండా పింఛన్ అందరకీ ఒకేలా చేసి దివ్యాంగుల సంక్షేమం గాలికి వదిలేసిందన్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛన్ ను రూ.3 వేల నుంచి రూ.6వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనే ఈ రాష్టానికి పెద్ద ప్రాబ్లెమ్..

### జగన్‌పై ప్రజల కోపం మాత్రం మెగా ఇష్యూ

### వైసీపీ చేసిన ప్రతి తప్పు... వాళ్ళ దృష్టిలో నో ఇష్యూ నే...

## జగన్‌పై మంత్రి సుభాష్ మండిపాటు



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వైయస్ జగన్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ప్రతి తప్పును "నో ఇష్యూ"గా తీసుకున్న జగన్, ఇప్పుడు చిన్న విషయాలకే పెద్దగా మాట్లాడటం ప్రజలను మోసం చేసే ప్రయత్నమని విమర్శించారు. జగన్ పాలన అంతా 'నో ఇష్యూ'లే, తల్లిని, చెల్లిని ఆస్తి కోసం బయటకు గెంటేసినా అది నో ఇష్యూగా తీసుకున్నారు. సొంత బాబాయి హత్య కేసు చుట్టూ ఉన్న అనుమానాలున్నా ... నో ఇష్యూ.... రాష్ట్రాన్ని గంజాయి, మైనింగ్, ఇసుక మాఫియాల అడ్డాగా మార్చిన పాలన... ఐనా నో ఇష్యూ.. తిరుమల పవిత్రతకు భంగం కలిగించినా చర్యలు... నో ఇష్యూగా మిగిలిపోయాయని తెలిపారు. పరామర్శల పేరుతో పేదల ప్రాణాలు కార్ల టైర్లు కింద తీసినా ... నో ఇష్యూ... సినిమా డైలాగులతో రఫా రఫా నరుకుతా అంటూ ప్రజలను రెచ్చగొట్టినా నో ఇష్యూ.... రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసి ఆర్థికంగా కుదేలుచేసినా... నో ఇష్యూగా... జే బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యం అమ్మి ఎంతోమంది ప్రాణాలు బలి తీసుకున్న..... అనేక కుటుంబాలు రోడ్డున పడ్డా నో ఇష్యూ... యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన పాలన... నో ఇష్యూ... పెట్టుబడుదారులు పారిపోయేలా చేసి అభివృద్ధిని అడ్డుకున్నా... నో ఇష్యూ.... రైతుల రాజధాని ఆశలను ఛిద్రము చేసినా... నో ఇష్యూ... ఇవేమీ పట్టని జగన్ రెడ్డికి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు అంటూ మంత్రి వాసంశెట్టి సుభాష్ దుయ్యబట్టారు. జగన్... నువ్వు మాట్లాడేది నీతి కాదు, రాజకీయ నటన మాత్రమే అని తీవ్రంగా విమర్శించారు. తప్పులు చేసి తలదించుకోవాల్సింది పోయి మళ్లీ ప్రజల ముందుకు రావడం ధైర్యం కాదు, దర్పం అన్నారు. నీ పాలనలో అన్నీ నో ఇష్యూ లే ... ఇప్పుడు లేనిపోని ఇష్యూలు సృష్టించింది కూడా జగన్ రెడ్డి నే... అధికారంలో ఉన్నప్పుడు చేసిన దోపిడీ మర్చిపోయి ఇప్పుడు నీతి వాగ్దానాలు చెప్పడం ప్రజలను అవమానించడం అని మండిపడ్డారు మంత్రి సుభాష్. పులి చర్మం కప్పుకున్నా గాడిద గాడిదే.. మంట పెట్టిన వాడే ఇప్పుడు నీళ్ళు పోస్తున్నట్టు నటిస్తున్నాడు జగన్.. జగన్ ఎన్ని తప్పులు చేసినా "నో ఇష్యూ" అన్న రోజులు ముగిశాయని, ఇప్పుడు ప్రతి తప్పు ప్రజల ముందే నిలబడుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఇది నవ్యాంధ్ర ప్రదేశ్, మా నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మానవతా విలువలు కలిగిన వారు.. ఇక్కడ మోసపూరిత రాజకీయాలకు స్థానం లేదని మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జగన్ నాటకాలు ప్రజలంతా గమనిస్తున్నారని.. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని చవక బారు రాజకీయాలు మానుకోవాలని మంత్రి సుభాష్ హితవు పలికారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

## అమలాపురంలో ఎమ్మెల్యే ఆనందరావు శ్రీకారం





**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకొని దివ్యాంగ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిందని స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. బుధవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో ఈ పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, కార్యక్రమం ముగిసిన తరువాత వారితో ఆత్మీయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో కేవలం నాలుగు వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేదని, ఇప్పుడు దాన్ని 21 వర్గాలకు విస్తరించామని తెలిపారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పూర్తిగా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించామని చెప్పారు. అలాగే, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వారు, మూగ-చెవిటి వారు, మానసిక వైకల్యం ఉన్నవారికి పూర్తిగా ఉచిత ప్రయాణం అందుబాటులో ఉండగా, వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం చార్జీల రాయితీ కల్పించామని తెలిపారు. గతంలో ఈ వర్గాలకు కేవలం 50 శాతం రాయితీ మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి గత ఏడాది డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చారని ఆయన పేర్కొన్నారు. ఉగాది కానుకగా ఈ పథకాన్ని ప్రకటించడం ద్వారా ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోందని అన్నారు. "స్త్రీశక్తి" పథకంలో ఉన్న బస్సులనే "దివ్యాంగ శక్తి"కి కూడా వర్తింపజేశారని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన డిజిటల్ పాస్‌లను "మన మిత్ర" వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఆర్టీసీ యాప్‌ల ద్వారా పొందవచ్చని, అలాగే ఆర్టీసీ బస్టాండ్లలోని కౌంటర్లలో కూడా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సదరం యాప్‌తో అనుసంధానం చేసినందున ఫిజికల్ సర్టిఫికేట్ చూపాల్సిన అవసరం లేదని, క్యూఆర్ కోడ్ ఆధారంగా ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారని వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి. గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల చేత ప్రారంభించారని తెలిపారు. దివ్యాంగుల్లో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని అన్నారు. శారీరక, మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ పథకం ద్వారా భరోసా కలుగుతుందని తెలిపారు. కోనసీమ జిల్లాలో "స్త్రీశక్తి" పథకం వర్తించే 194 బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని, ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన సుమారు 55 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింపజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిటిఓ డి.శ్రీనివాసరావు, డిఆర్డిఏ పీడీ డి. రాంబాబు, డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్. శర్మ, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, కూటమి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం సమర్థవంతంగా మధ్యాహ్న భోజన పథకం అమలు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం సమర్థవం తంగా అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపాలెంలో జిల్లా పరిషత్ హైస్కూలును ఎమ్మెల్యే సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ అమలు, నాణ్యత పరిశీలించారు. ఆహారం నాణ్యత ఎలా ఉంటోంది? అని ఎమ్మెల్యే విద్యార్థులను ప్రశ్నించగా వారు బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యత స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల తల్లితండ్రులకు ఫోన్ చేసి భోజనం ఆలా ఉంటుంది అని తెలుసుకున్నరు. తన ప్లేట్ తానే శుభ్రం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరతాన్నధాత్రిగా ఖ్యాతి పొందిన డొక్కా సీతమ్మ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సన్న బియ్యంతో నాణ్యమైన ఆహారం, రుచికరమైన పదార్థాలతో వడ్డిస్తున్నట్లు తెలిపారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయటం ద్వారా విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వడం ఈ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు.

# నూకాంబిక జాతరలో కట్టుదిట్టమైన బందోబస్తు : సీఐ విద్యాసాగర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర తీర్థ మహోత్సవం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పోలీసులు నిరంతరం పహారా కాస్తూ భక్తులకు భద్రత కల్పిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ, భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. అనంతరం సీఐ విద్యాసాగర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

### ఎంఎస్‌ఎంఈలు అభివృద్ధి చెందేలా

# బ్యాంకర్ల సహకారం అందించాలి

### వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానంతో కూటమి ప్రభుత్వం ముందడుగు

### బ్యాంకర్లతో సమావేశంలో ఎమ్మెల్యే బండారు





**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యాపారాల్లో బలహీన వర్గాలకు చేయూత నిచ్చే ఎంఎస్‌ఎంఈలకు మద్దతు నిస్తూ, బ్యాంకర్లు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అయన పీడీ.డిఆర్ డివో.రాంబాబు,ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. శ్రీనివాస్, ఎల్డిఎం వర్మ,డి ఎల్ డిఓ ఓరాజేశ్వరరావు,ఆకుల రామకృష్ణ,రావులపాలెం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం,ఆత్రేయపురం ఎంపీడీవో రామన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ క్రెడిట్ సౌకర్యాలను విస్తరించేందుకు బ్యాంకర్ల సమావేశం,సంయుక్త మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు.ఎంఎస్‌ఎంఈలు అభివృద్ధి చెందేలా బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వం, బ్యాంకర్లే వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరీ ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాల్సిన అవసరం ఉందని, డ్వాక్రా సంఘాల మహిళలను ప్రోత్సహించాలన్నారు.ఎంఎంఎస్‌ఎంఈలకు ప్రొత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలమన్నారు. వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు.

# దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం

### సహాయ పరికరాల పంపిణీ చేసిన దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కట్టుబాటుముమ్మిడివరం నియోజకవర్గంలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం మరియు సహాయ పరికరాల పంపిణీ ముమ్మిడివరం నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. గౌరవ ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ముమ్మిడివరం నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో దివ్యాంగ శక్తి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ డి ఐపీ పథకం కింద ఎలైమాకో ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమం ముమ్మిడివరం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించబడింది. గతంలో నిర్వహించిన పరీక్షల ద్వారా అర్హత సాధించిన లబ్ధిదారులకు పరికరాలు అందజేయడం జరుగుతుండగా, ముందస్తు విడతలో పరికరాలు పొందని 16 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా సహాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో గౌరవంగా మరియు స్వయం సమర్థులుగా జీవించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. దూరదృష్టితో దివ్యాంగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారం అందుకున్న విద్యా బాల మందిర్ కరస్పాండెంట్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ దిడ్ల సురేష్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం మహోత్సవం -2026 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పరాభవనామ సంవత్సరం పంచాంగం శ్రవణం చేసి అన్ని రాసులు వారికి రాశిఫలాలు వివరించారు. మెజీషియన్ చింతా శ్యామ్ వాఖ్యాత గా ఉగాది పురస్కారం మహోత్సవం జరిగింది. విద్యా బాల మందిర్ కరస్పాండెంట్ రామోజు అనురాధకి, విక్టరీ వెంకటరెడ్డి,కళారత్న కొండా నరసింహారావు, కళారత్న కొండా అలివేలు మంగాదేవి దంపతుల చేతుల మీదుగా షాలువాతో మేమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపరేటర్ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి



### ఏపీ ఫైబర్‌ను బోలోపేతం చేయాలి

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావుకి బుధవారం పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూఏపీ ఫైబర్ ను బోలోపేతం చేయాలి.నియోజకవర్గ పరిధి కేబుల్ టీవీ ఆపరేటర్ మేము ప్రతిష్టాత్మకమైన ప్రసార మాంధ్యమం కేబుల్ టీవీ రంగం ఉపాధితో సొంత పెట్టుబడులతో జీవనోపాధి పొందుతున్నాము. సుమారు 35 సంవత్సరాలుగా నిరంతరం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పెట్టుబడులు పెట్టి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాము. అన్నింటా మాదిరిగానే పోటీ వ్యాపారంలో నష్టాలు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవనోపాధి కష్టంగా మారింది దయచేసి విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ అధికారుల చర్యలను ఉపసంహరించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాం. అంతే కాకుండా మేముగత 35 సంవత్సరములుగా కేబుల్ వ్యాపారం చేసుకుంటూ కేబుల్ ఆపరేటర్ కొనసాగుచున్నాము. మేము మరియు మా కింద పని చేసే కార్మికులు వేలాదిమంది జీవనోపాధి పొందుతున్నాము. ప్రజలకు మెరుగైన ఛానల్స్ ను అందిస్తూ గవర్నమెంట్ కి 18% టాక్స్ జీఎస్టీ చెల్లిస్తూ ప్రజలకు మెరుగైన సిగ్నల్ అందిస్తూ జీవనోపాధి పొందుతున్నాము. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఏపీ ఎస్ ఎఫ్ ఎల్ ఎవరు వేసుకుంటే వాళ్లకు కరెంటు స్తంభాల నుండి మినహాయింపు ఇస్తామని ఆ రోజుని మోరీ బహిరంగ సభలోచెప్పడం జరిగింది. దీనిని కూడా పరిగణంలో తీసుకుని మాకు మీ ద్వారా న్యాయం జరిగేటట్టు చూడాలని కోరుకుంటున్నాము కార్యక్రమంలో ఎం. ప్రసాద్, కొత్తపేట మండలం ఇంచార్జ్ కార్యదర్శులు శీలం రామకృష్ణ,వాకాడ బాబులు, దొంగ శ్రీను, ఆత్రేయపురం మండలం ఇంచార్జ్, కార్యదర్శులు, సిహెచ్ ఎస్ వి ప్రసాద్ రాజు,డి తాతారావు, రుద్దరాజు సాయి రామరాజు,కల్లూరి పుల్లేశ్వరరావు ,రావులపాలెం మండలం మండల ఇంచార్జ్, కార్యదర్శి పోలవరపు శ్రీనివాసరావు, కాసా అరుణ్ కుమార్, ఆలమూరు మండలం ఇంచార్జ్ గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




## ఈ ఏడాది పొంచి ఉన్న

# ఎల్ నినో అధిక ఉష్ణోగ్రతల ముప్పు...?

**రైతులు ప్రత్యామ్నాయ పంటల మీద దృష్టి పెట్టాలి - చేపల వేటకు బదలు ప్రత్యామ్నాయ ఉపాధి చేపట్టాలి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ ఏడాది ఎల్ నినో అధిక ఉష్ణోగ్రతల ఏర్పడే ముప్పు ప్రభావ ప్రమాదం పొంచి ఉంది. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల ప్రపంచ వాతావరణంలో తీవ్ర ప్రతికూల మార్పులు సంభవిస్తాయి. భూమధ్యరేఖ పసిఫిక్ లోని సముద్ర ఉపరితల జలాలు సగటు కంటే వెచ్చగా మారినప్పుడు, తూర్పు గాలులు సాధారణం కంటే బలహీనంగా వీచినప్పుడు ఎల్ నినో పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల వర్షపాతం తక్కువగా ఉంటుంది. ఫలితంగా వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగి, వేడి తరంగాలు అధికమవుతాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల చేపల వేటపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహా సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడం వల్ల కలిగే వాతావరణ మార్పు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, తక్కువ వర్షపాతంతో ఆగ్నేయ ఆసియాలో, ఆస్ట్రేలియాలో కరువు కాటకాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పెరూ, ఈక్వెడార్, అమెరికా వంటి దేశాల్లో భారీ వర్షాలు, అధిక వరదలు సంభవిస్తాయి. భారతదేశంలో ఎల్ నినో సంవత్సరాల్లో ఋతు పవన వర్షాలు తగ్గుతాయి, ఇది ముఖ్యంగా



వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తుంది. భారతదేశ వాతావరణంలో నైరుతీ ఋతు పవనాలపై ప్రతికూల ప్రభావం పడటంతో ఋతు పవనాలు బలహీనపడి, అధిక ఉష్ణోగ్రత, తీవ్రమైన వేడి వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వర్షాలు తగ్గి పోతాయి. వర్షాలు తగ్గడం వల్ల పంట దిగుబడి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆహార ఉత్పత్తిలో కొరత ఏర్పడుతుంది, ఆహార ధరలు పెరగవచ్చు. ఫలితంగా ఇది కరువు పరిస్థితులకు దారి తీస్తుంది. 2015లో ఎల్ నినో వల్ల వర్షపాతం 14 శాతం కంటే తక్కువైంది. ఇది కరువు పరిస్థితులకు దారితీసింది. దీంతో ఇప్పటి నుంచే ప్రభుత్వాలు, ప్రజలు కూడా సమన్వయంతో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారి జోకా అమృత కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు బుధవారం రైతన్నా మీకోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి కె.విజయ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడతాయని, అందువల్ల ఈ వాతావరణానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం గురించి రైతులు ఆలోచించాలని సూచించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ... ఈ ఖరీఫ్ పంటకు సంబంధించి ముందుగా నీటిని మే 15కి విడుదల చేస్తారని తెలిపారు. రైతులు ఏప్రిల్, మే నెలల్లో పిఎండిఎస్ కిట్స్ విధానం ద్వారా వ్యవసాయ సాగు భూముల నేల నీటి ఎద్దడికి గురికాకుండా చెయ్యడం ద్వారా కొంత మేర నేలలో ఉష్ణోగ్రతలను తగ్గించ వచ్చునని ఆయన సూచించారు. రబీ సీజన్ పంట నమోదు చేసుకున్న రైతులు ఈకెవైసీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో జగ్గంపేట డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఏ.శ్రీనివాస్, మండలం వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వేళంగి భాను ప్రకాష్ స్కూల్ విద్యార్థి

# నవోదయ ప్రవేశ పరీక్షకు ఎంపిక

**హర్షం వ్యక్తం చేస్తున్న స్కూల్ యాజమాన్యం**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన భాను ప్రకాష్ స్కూల్ మండలంలో ఒక ప్రత్యేకమైనటువంటి ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. వేళంగి మరియు చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ స్కూలు ఒక భరోసాగా నిలిచింది. తల్లిదండ్రుల నమ్మకం పిల్లల భవిష్యత్తుకు గ్యారంటీ అనే స్కూల్ గా ముద్ర పడింది. ఈ స్కూల్లో కొన్ని సంవత్సరాల ముందు నుంచి చదువుకున్న విద్యార్థులు వాళ్ల పిల్లలను కూడా ఇదే స్కూల్లో జాయిన్ చేయడం విశేషం. వేళంగి గ్రామంలో ఉన్న ఈ భాను ప్రకాష్ స్కూల్ యాజమాన్యం వారు కూడా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల ఆశలను వమ్ముచేయకుండా అహర్నిశలు కష్టపడి పిల్లలకు మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, పెద్దలతో గౌరవంగా ఉండటం, ఆటపాటలలో కూడా ఉత్సాహంగా ఉండేలా మరియు అన్నింటికైనా ముఖ్యమైన విషయం పోటీ పరీక్షలలో ఏ కాంపిటేషన్ ఎగ్జామ్స్ అయినా సరే భాను ప్రకాష్ స్కూల్ పిల్లలు హాజరైతే విజయాలతోనే తిరిగి వస్తారు . అలా విద్యార్థులను తయారు చేస్తారు. ముఖ్యంగా నవోదయ స్కూల్ మరియు సైనిక్ స్కూల్స్ వంటి ప్రాముఖ్యత కలిగిన పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులను తయారు చేయడం ఈ స్కూల్ ప్రత్యేకత. గతంలో ఈ స్కూలు నుండి అనేకమంది విద్యార్థులు నవోదయ లాంటి స్కూళ్లకు ఎంపికయ్యారు. ఈ సంవత్సరం కూడా నవోదయ ఎంట్రన్స్ పరీక్షలలో భాను ప్రకాష్ స్కూల్ నుండి వేళంగి గ్రామానికి చెందిన ధనమ్మ చెరువుగట్టు నివాసి అయిన వాసంశెట్టి శ్రీహర్ష అనే విద్యార్థి మంచిర్యాంకు సాధించి నవోదయ విద్యాలయా ప్రవేశ పరీక్షకు సెలెక్ట్ అయ్యాడు. గ్రామానికి మరియు భాను ప్రకాష్ స్కూల్ కి మంచి పేరు తీసుకొచ్చాడు. శ్రీ హర్ష ను కరప మండల విద్యాధికారి అయిన బుల్లి కృష్ణవేణి ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ యాజమాన్యంతో పాటు విద్యను అందించే గురువులు మరియు గ్రామస్తులు, స్నేహితులు శ్రీ హర్ష ను అభినందించారు.

# ఎమ్మెల్యే చొరవతో కొత్తపేట - వాడపాలెం రోడ్డు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్డు గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొత్తపేట -వాడపాలెం రోడ్డును అభివృద్ధి పరుస్తున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవ తో సుమారు మూడు కోట్ల రూపాయలతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. కరెంటు స్తంభాలను సైతం పక్కకు జరిపి 7 మీటర్ల వెడల్పుతో భారీ సిసి రోడ్డును నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిపాలనలో తప్ప రోడ్డు గురించి పట్టించుకున్న నాథుడు లేరు.కొత్తపేట వాడపాలెం రోడ్డు కి ఎప్పుడు మరమ్మతులు చేపట్టిన సత్యానందరావు హయాంలోనే జరిగింది. పాలకులు మారారు కానీ గుప్పెడు మట్టి పోసిన వారు లేరు.ఇప్పుడు ఈ రోడ్డు పునర్నిర్మాణం సత్యానందరావు ఎమ్మెల్యేగా ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభివృద్ధి పరుస్తున్నారు.ఏ రోడ్లు అభివృద్ధి జరగాలన్న ప్రజల సహకారం తప్పనిసరి ముఖ్యంగా రోడ్డు వెడల్పు గా నిర్మించాలంటే ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి.రోడ్డు నిర్మాణం జరుగుతుండగా ఇష్టానుసారం డ్రైనేజీ గొట్టాలను ఎవరి ఇంటి ఎదురుగా వారు రాత్రికి రాత్రి గొట్టాలు అమర్చారు. రోడ్డు వేస్తారని తెలిసిన ముందుగా వేసుకోకుండా రోడ్డు పగలగొట్టి వేయటం జరిగింది. దీనివలన రోడ్డు బలహీనపడే అవకాశాలు ఉన్నాయనీ కాంట్రాక్టర్లు అధికారులు చెబుతున్నారు. నలుగురు ఐదుగురు కలిపి ఒక మ్యాన్ హోల్ ఏర్పాటు చేసుకొని డ్రైనేజీ గోట్టాలు పెట్టుకుంటే మంచిదని దీని కనుగుణంగా చుట్టుపక్కల ఉన్న ప్రజలు సహకరించాలని రోడ్డు పరిశీలనకు విచ్చేసిన ఎమ్మెల్యే ప్రజలకు వివరించి ప్రజలు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.మారిన జనాభా పరిస్థితులు కనుగుణంగా రోడ్డు వెడల్పులు జరగాలనీ అందుకు అనుగుణంగా నిధులు వేచ్చించి రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక చోట్ల రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలియజేశారు.

## రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం

# కూటమి ప్రభుత్వం కృషి

**రూ.12కోట్లతో దేవరపల్లిలో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు నిర్మాణం**

**దేవరపల్లిలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు. బుధవారం రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతల ఆర్థిక భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ - పి.యమ్. కిసాన్' పథకం రైతులకు ఎంతో ఊరటనిస్తోందని అన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మూడు విడతలుగా ఒక్కో రైతు ఖాతాలో మొత్తం రూ. 20,000 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం జమ చేసిందని ఆయన వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన మూడవ విడత కింద రూ.6,000 రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే వివరించారు. నీటి భద్రత, అగ్రిటెక్, డిమాండ్ ఆధారిత పంటల సాగు మొదలైన అంశాలపై దృష్టి పెట్టామన్నారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను కూడా భారీ రాయితీ పై అందిస్తున్నామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. దేవరపల్లిలో అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీ కేంద్రం ఏర్పాటు జరుగుతుందన్నారు. రూ.12కోట్లతో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు నిర్మాణం జరుగుతుందన్నారు.

# ఉగాది అంటే కొత్త కాలానికి ఆరంభం

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగువారి ముఖ్యమైన పండుగ ఉగాది ఇది తెలుగు నూతన సంవత్సర ప్రారంభాన్ని సూచిస్తుంది సాధారణంగా చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది జరుపుకుంటారు ఉగాది అనే పదం యుగాది నుండి వచ్చింది యుగ అంటే కాలం ఆది అంటే ప్రారంభం అంటే కొత్త కాలానికి ఆరంభం ఇది తెలుగు నూతన సంవత్సర మొదటి రోజు ప్రకృతి పునరుత్పత్తి ప్రారంభం అంటే



వసంత రుతువు ప్రారంభం కొత్త ఆశలు కొత్త లక్ష్యాలు ఆరంభం ఈ పండుగ ప్రత్యేకతలు ముఖ్యంగా ఉగాది పచ్చడి ఇది తీపి చేదు వగరు పులుపు కారం ఈ రుచులతో తయారుచేస్తారు.

దీని అర్థం జీవితంలో కూడా సుఖము సంతోషము ఆనందము బాధ కోపము ఆశ్చర్యము ఉంటాయని ఉంటేనే జీవితం అని తెలియజేస్తుంది. తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు.

# అమలాపురంలో 'జాదూగర్ సికిందర్' ఇంద్రజాల విన్యాసాల హోరు

**నేటి నుంచే మ్యాజిక్ షోలు.. అబ్బురపరిచే 'డైనోసార్ భ్రమ', 'బెర్ముడా ట్రయాంగిల్' విన్యాసాలు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**
అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు అద్భుతమైన వినోదాన్ని అందించేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెజీషియన్ సూపర్ స్టార్ 'జాదూగర్ సికిందర్' అమలాపురానికి చేరుకున్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వేదికగా నేటి నుంచే ఈ గ్రాండ్ మ్యాజిక్ షోలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రదర్శనలు వరుసగా 20 రోజుల పాటు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ రెండు షోలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి షో సాయంత్రం 5:00 గంటల నుండి 7:00 గంటల వరకు, రెండవ షో రాత్రి 7:00 గంటల నుండి 9:00 గంటల వరకు జరుగుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించడానికి అనువైన ఈ ప్రదర్శనలు అన్ని వయస్సుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడ్డాయి. గతంలో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో 10 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన సికిందర్ బృందం, ఇప్పుడు అమలాపురం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా 'డైనోసార్ భ్రమ' (డైనోసార్ ఇల్యూషన్), రహస్యాలతో నిండిన 'బెర్ముడా ట్రయాంగిల్' విన్యాసం, అలాగే గగుర్పాటు కలిగించే వినూత్న ఇంద్రజాల ప్రదర్శనలు ఉండనున్నాయి. ఇవే కాకుండా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించే 'కామెడీ మ్యాజిక్' ప్రదర్శనలు కూడా షోకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. వినోదంతో పాటు ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా ప్రతి అంశాన్ని సరికొత్త సాంకేతికతతో రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఆర్గనైజర్ ఏ.కే. బాబు మాట్లాడుతూ, కోనసీమ ప్రజలకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ షోలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, కుటుంబాలు పెద్ద ఎత్తున హాజరై ఈ అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనను ఆస్వాదించాలని ఆయన కోరారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి కావడంతో అమలాపురంలో మ్యాజిక్ సందడి మొదలైంది. ప్రదర్శన సమయాలు, టిక్కెట్ల వివరాల కోసం ఆసక్తి గల వారు నేరుగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# భట్నవిల్లిలో పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఆదేశాల మేరకు అమలాపురం శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు బుధవారం అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాల రికార్డులను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. బోధన విధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట సిబ్బందితో మాట్లాడి, ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. వారికి ఎదురవుతున్న సమస్యలను కూడా తెలుసుకున్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయ

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం



వెంకటలక్ష్మి, బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు శాశ్వత నష్టం తప్పదు : ట్రంప్

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త దాడుల వల్ల ఇప్పటికే ఇరాన్ భారీగా నష్టపోయింది. ఓవైపు కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండగా.. మరోవైపు అణు స్థావరాలు, పౌర నివాసాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులు ఇంకా ముగియలేదని.. ఆ దేశానికి శాశ్వత నష్టం కలిగించడానికి అగ్రరాజ్యం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పుడే యుద్ధాన్ని ఆపేసినా ఆ దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి అక్కడి పాలకులకు 10 ఏళ్ల సమయం పడుతుందని అన్నారు. కానీ మళ్లీ కోలుకోలేనివిధంగా ఇరాన్‌కు నష్టం కలిగించాలన్నదే తమ లక్ష్యమని వెల్లడించారు. మరో అధ్యక్షుడు ఇటువంటి తప్పు చేయకుండా ఇరాన్‌కు తగిన బుద్ధి చెబుతామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంపై తాము చేపట్టిన ఆపరేషన్ సరైన దిశలోనే వెళుతోందన్నారు. భవిష్యత్తులో ఇరాన్ నుంచి ఎవరికీ అణుముప్పు కలగకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు. మరో రెండు వారాల పాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉందన్నారు. తాము ముందస్తు దాడులను ప్రారంభించకపోయి ఉంటే ఇరాన్ ఇప్పటికే పలు అణ్వాయుధాలను అభివృద్ధి చేసేదని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నాటో తెలివితక్కువగా ప్రవర్తిస్తోందన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమ మిత్రదేశాలు ముందుకురావట్లేదన్నారు. అయినప్పటికీ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. తమది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశమని..అత్యంత శక్తిమంతమైన సైన్యం తమకు ఉందని పునరుద్ఘాటించారు.





# 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత : ఎమ్మెల్సీ సోమువీర్రాజు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజులు విభిన్న ప్రతిభావంతులతో కలిసి బస్సులో ప్రయాణించి, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా ఈ 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకులకు ఆర్టీసీ బస్సుల్లో గుర్తించిన కేటగిరీలలో 50 శాతం టికెట్ రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.



విభిన్న ప్రతిభావంతుల సాధికారతకు అవసరమైన శారీరక, వైద్య, ఆర్థిక తదితర రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన దివ్యాంగులకు రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పించన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధి రుణాలు, సబ్సిడీపై త్రిచక్ర వాహనాలు తదితర సహాయాలను అందిస్తూ సమాజంలో వారిపై ఉన్న అవరోధాలను తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా వారి జీవితాల్లో భరోసా నింపుతోందని తెలిపారు. దివ్యాంగులను దయతో చూసే విధానం మారాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులలో అపారమైన శక్తి సామర్థ్యాలు, అంతులేని ఆత్మస్థైర్యం ఉంటాయని పేర్కొన్నారు. తగిన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుత విజయాలు సాధించగలరని అన్నారు. అనంతరం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మేలుకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (ఆర్ఎంసి) ఎస్. వెంకటరమణ, సెక్రటరీ (ఆర్ఎంసి) శైలజవల్లి, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ (రాజమహేంద్రవరం) కె. మాధవ్, పీఆర్వో బి.ఎస్. కుమార్, ఎస్.ఎం. ఏ.వి. రావు, కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, అత్తి సత్యనారాయణ, కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, వర్రే శ్రీనివాసరావు, పక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌ను కలిసిన మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నీ మండపేట పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి బుధవారం కలిశారు. తాడేపల్లి లోని జగన్ నివాసం లో ఆమె ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె భర్త పతీవాడ రమణ, ఓం జ్యువెలరీ అధినేత కొమ్ము రాంబాబు లతో కలిసి జగన్ తో భేటీ అయ్యారు. మంగళ వారం తో చైర్ పర్సన్ పదవి కాలం ముగిసింది. ఈ నేపథ్యంలో అధినేత జగన్ ను కలవడం ప్రాధాన్యత ను సంతరించుకుంది. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి ఆయన అడిగి తెలుసుకున్నారు. తనకు అవకాశం ఇచ్చినందుకు జగన్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కంచుకోట గా ఉన్న మండపేట మున్సిపాల్టీ లో తాము పోటీ చేసి గెలుపొందినట్లు వివరించారు. జగన్ వలనే తను చైర్ పర్సన్ అయ్యాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జగన్ వారితో మాట్లాడుతూ పార్టీ అవకాశాలు ఇస్తుందని పేర్కొన్నారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను అడ్డుకొని ప్రజల పక్షాన పనిచేయాలని చెప్పారు. తన ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని జగన్ అన్నారని రాణి స్థానిక మీడియాకు తెలిపారు.

# ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల చెయ్యాలి

## ఫీజులు విద్యార్థులను కట్టమని ఒత్తిడి చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న జిజియు,రైట్ ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులను ఇబ్బంది పెడుతూ ఒత్తిడికి గురిచేస్తూ ఫీజు రీయంబర్స్మెంట్ కట్టించుకోవటంతో విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై.భాస్కర్,ఎన్. రాజా మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయంబర్స్మెంట్ వెయ్యక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.ఒక పక్క విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజు రీయంబర్స్మెంట్ గురించి విద్యార్థులకు సంబంధం లేదు కళాశాల అకౌంట్ లోనే వేస్తాము అని చెప్పారు. కానీ తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల చేత బలవంతపు ఒత్తిడికి గురి చేసి కట్టించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రైట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఫీజు కడితేనే మీకు సెమిస్టర్ పరీక్ష ఫీజు అప్లికేషను ఇస్తామని లేదంటే ఇవ్వమని బెదిరిస్తున్నారన్నారు. జిజియు ఇంజినీరింగ్ కాలేజీలో ఇదే పరిస్తితి ఉండటంతో విద్యార్థులు 12వ తేదీన పెద్ద ఎత్తున కళాశాల బయట ఆందోలాన చేయటంతో రిజిస్ట్రార్ దిగి వచ్చి ఫీజు రీయంబర్స్మెంట్ కి పరీక్షలకు ముడి పెట్టమని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు కానీ ఎవరయితే ఆందోళన చేశారో వాళ్ళని వ్యక్తిగతంగా టార్గెట్ చేసి బెదిరిస్తున్న పరిస్థితి ఈ రోజు వరకూ జరుగుతుంది అని అన్నారు. కలెక్టర్ మాట కూడా లెక్క చేయని జీజీయు పై చర్యలు తీసుకోవాలని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సెమిస్టర్ ఫీజు కట్టడానికి అప్లికేషను ఇప్పించాలని ఫీజు రీయంబర్స్మెంట్ ప్రభుత్వం వేసే వరకూ విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా ఉండాలని ఇలా ఇబ్బంది పెడుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ కి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించటం జరిగింది. మేఘా స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి పరీక్షలు ఆపరని ఒకవేళ ఆపితే తక్షణమే చర్యలు తీసుకుంటామని వెంటనే ఈ కళాశాలలతో మాట్లాడతామని అన్నారు. ఈ హామీతో విద్యార్థులు ఆందోళన తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కనక, జ్యోతి, కార్తిక్, శివ బాలాజీ, సౌమ్య ఎస్.ఎఫ్.ఐ నాయకులు సంధ్య, మౌళి, మనోజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన బత్తుల

## దివ్యాంగుల సహాయకులకు 50శాతం టిక్కెట్ రాయితీ – కండక్టర్ అవతారమెత్తిన బత్తుల

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్** : ఎన్డీఏ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తుందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం కోరుకొండ బస్టాండ్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని బత్తుల ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ వైసిపి హయాంలో దివ్యాంగులు ఎన్నో అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో వాటిని అధిగమించి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు దివ్యాంగుల పెన్షన్ 4వేల నుండి 6వేలకు పెంచడం, ఉగాది కానుకగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకానికి ఆర్టీసీకి ఏడాదికి 207 కోట్ల రూపాయలు చెల్లిస్తుందన్నారు. దివ్యాంగులతో పాటు ప్రయాణించే సహాయకులకు టికెట్ ధరలో 50% రాయితీ ఉంటుందన్నారు. ఈ పథకం 40శాతం పైబడి అంగవైకల్యం ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. బత్తుల దంపతులు, మండల స్థాయి అధికారులు దివ్యాంగులతో కలిసి బస్సులో గాదరాడ బత్తుల స్వగృహానికి వెళ్ళేటప్పుడు బత్తుల కండక్టర్ అవతారం ఎత్తారు. అనంతరం బత్తుల దంపతుల ఆధ్వర్యంలో దివ్యాంగులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఎస్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, తాసిల్దార్ సుగుణ, సర్కిల్ ఇన్స్పెక్టర్



సత్యనారాయణమూర్తి, ఎస్సై అంకారావు, జనసైనికులు అద్దాల శ్రీను, బదిరెడ్డి దొర,ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్, కర్రి గణేష్, ఎన్డీఏ నాయకులు, దివ్యాంగులు, పలువురు ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయకు సిద్ధాంతపు మౌనిక ఎంపిక

## మౌనికను అభినందించిన స్థానికులు

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్** : కోరుకొండ మండలంకోటికేశవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు మౌనిక నవోదయకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భగవాన్ తెలిపారు. బుధవారం కోటి కేశవరం 3వ పాఠశాలకు చెందిన సిద్ధాంతపు మౌనిక నవోదయకు ఎంపిక కావడం పట్ల ఉపసర్పంచ్ కొమ్మనాపల్లి గంగరాజు మౌనికను అభినందించారు.



ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గంగరాజు మాట్లాడుతూ మౌనిక తమ గ్రామానికి మంచి పేరు తెచ్చిందని, భవిష్యత్తులో చదువుల్లో చక్కగా రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు భగవాన్ ను ఘనంగా సత్కరిస్తూ, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న డాక్టర్ నవీన్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మండపేట కలువపువ్వు సెంటర్‌లో ఉన్న ప్రాచీన హనీఫీ అహలే సున్నత్ వల్ జామియా మస్జిద్‌లో ప్రముఖ కెవిఆర్ హాస్పిటల్ డాక్టర్ నవీన్ బుధవారం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుతూ ఐక్యతను పెంపొందిస్తాయని,రోజంతా ఉపవాసం తర్వాత తీసుకునే ఆహారం శక్తిని ఇస్తుంది, అలాగే తేలికపాటి, పోషకమైన ఆహారం తీసుకోవడం మంచిదని సూచించారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, షేక్ సర్కార్, ఫిజియోథెరపీ డాక్టర్ హైదర్ అలీ,షేక్ అర్షద్, షేక్ బాదుషా,సయ్యద్ రషీద్,తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీస్‌లో శ్రీ పరాభవ నామ సంవత్సర

# ఉగాది వేడుకలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : మండపేట పబ్లిక్ స్కూల్‌లో బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి పండుగను సంప్రదాయబద్ధం గా, వైభవంగా జరుపుకోవడం ఎంపీఎస్ ప్రత్యేకత అని విద్యాసంస్థల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పండుగ విశిష్టతను విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చక్కగా ప్రదర్శించారు. చిన్నారులు దేవతల వేషధారణలో, తెలుగు సాంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకుని అందరినీ అలరించారు. ఉత్సాహభరితంగా పాటలు, నృత్యాలు చేసి సందడి వాతావరణం నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ దేవళ్ళ సాయి గంగాధర్, స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్, ఉపాధ్యాయులు,స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### గౌతమీ బజార్ కట్టడాలపై

# హైకోర్టు ఆదేశాలు అమలు చెయ్యాలి

## – మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : రాజమహేంద్రవరం స్థానిక దేవి చౌక్, పశువుల ఆసుపత్రి వద్ద గల గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలను హైకోర్టు ఆదేశాలు అమలుపరిచి కూల్చివేయాలని నిరసన కార్యక్రమం చేపట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్, రాజమండ్రి పార్లమెంట్ సమన్వయ కర్త డాక్టర్ గూడూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. భరత్ రామ్ మాట్లాడుతూ గౌతమీ సూపర్ బజార్ స్థలం విషయంలో ముడుపులు తీసుకుంది నువ్వా! నేనా! ప్రజలకు తెలిసిపోయింది. గత ఎన్నికల సమయంలో గౌతమి సూపర్ బజార్ విషయంలో నేను ఐదు కోట్లు ముడుపులు తీసుకున్నానని వేల కరపత్రాలు సిటీ అంతా వెదజల్లిన ప్రస్తుత ఇవిఎం ఎమ్మెల్యే ఘనత, నీచ రాజకీయాలకు తెరలేపిన ప్రబుద్ధుడు.. నిజంగా అప్పట్లో నేను తీసుకున్నానేమో అని ప్రజలు నమ్మారో లేదు, అందుకు ఇప్పుడు హైకోర్టు లో పిటిషన్ వేసి కూల్చి వేయాలని ఆదేశాలు తెచ్చుకుని నా నిజాయితీ,



నచ్చీలత నిరూపించుకున్నాను ఇప్పుడు ముడుపులు తీసుకున్నది ఎవరో స్పష్టంగా ప్రజలకు తెలిసిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కనీసం సెల్లార్ పార్కింగ్ లేదు, తూర్పు వైపు 13 అడుగులు, ఉత్తరం వైపు 19 అడుగులు వదలకుండా, పోసిషన్ సర్టిఫికెట్ లేకుండా షాపులను అద్దెకు ఇచ్చేసి ఇంత అప్రజాస్వామ్యముగా చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడు, అలాగే జిల్లా కలెక్టర్, మున్సిపల్ ప్లానింగ్ అధికారులను కోరేది ఏమిటంటే అనుమతులను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి, అక్రమ కట్టడాలను కూల్చివేయండి, కోర్టు ఆదేశాలు గౌరవించండి తక్షణమే చర్యలు తీసుకోండి లేని పక్షంలో నిరసన ఉధృతం చేసి న్యాయం జరిగే వరకు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదు అని భరత్ హెచ్చరించారు. చట్టం అంటే గౌరవం లేదు, ప్రజల కష్టాలు పట్టవు, అభివృద్ధి శూన్యం, ముడుపులకు అగ్ర తాంబూలం ఇదే మన సిటీ ఎమ్మెల్యే తీరు.. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి మున్సిపల్ కార్యాలయంలో హైకోర్టు ఆదేశాలు అమలుపరిచి గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలను కూల్చివేయాలని వినతి పత్రం భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, వార్డు ఇంచార్జీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్యామలాంబ ఆలయానికి ఆదిరెడ్డి కుటుంబం రూ.లక్ష విరాళం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : స్థానిక గీత అప్సర థియేటర్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని బుధవారం సాయంత్రం ఆలయ చైర్మన్ కడియాల వీరభద్రరావుకు అందజేశారు. శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి ఉగాది మహోత్సవాలలో భాగంగా బుధవారం కొత్త అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిత ఆదిరెడ్డి కుటుంబానికి ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఆదిరెడ్డి కుటుంబం విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొయ్యల రమణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి జే వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కడియాల వీరభద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ వెంకట అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపు రెడ్డి వరలక్ష్మి , కురగంటి త్రినాథ్, కెల్లా జయలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, అండలూరి చంద్రశేఖర్, తోర్లపాటి శాలిని, కారుమూరి సురేష్, ఎక్స్ అఫీషియో మెంబర్ మాదిరెడ్డి పద్మావతి హాజరయ్యారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

సినీ వాయిస్ CINEMA

# ఉగాది స్పెషల్.. ఓటీటీలోకి కొత్త సినిమా..



ఈ వారం ఓటీటీలోకి మరో కొత్త సినిమా వచ్చేస్తోంది. యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కూతురు ఐశ్వర్య హీరోయిన్ గా నటించిన మొదటి సినిమా ఇది. థియేటర్లలో ఓ మోస్తరుగా ఆడిన ఈ ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ మరికొన్ని గంటల్లో స్ట్రీమింగ్‌కు రానుంది. యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలుగుతో పాటు తమిళం, కన్నడలో వందలాది సినిమాలు చేశాడీ సీనియర్ హీరో. డైరెక్టర్ గానూ సత్తా చాటాడు. అయితే ప్రస్తుతం నటుడిగా సినిమాలు బాగా తగ్గించేశాడు అర్జున్. తన వారసురాలిగా కూతురు ఐశ్వర్యను హీరోయిన్ గా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నాడు. అందులో భాగంగానే ఐశ్వర్యని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ సీతా పయనం అనే మూవీని తెరకెక్కించాడు. గత నెలలోనే ఈ మూవీ థియేటర్లలో విడుదలైంది. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన సీతా పయనం ఓ మోస్తరుగా ఆడింది. కన్నడ నటుడు ఉపేంద్ర అన్నయ్య కొడుకు నిరంజన్ ఈ చిత్రంలో హీరో గా నటించాడు. ప్రకాశ్ రాజ్, సత్యరాజ్, కోవై సరళ, సిరి హనుమంత్, సరన్ శక్తి, మణి చందన తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. అలాగే అర్జున్, అతని మేనల్లుడు కన్నడ ధ్రువ్ సర్జా క్యామియో పాత్రల్లో మెరిశారు. థియేటర్లలో ఓ మోస్తరుగా ఆడిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయిపోయింది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. సీతా పయనం సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సన్ నెక్ట్స్ సొంతం చేసుకుంది. ఉగాది కానుకగా గురువారం (మార్చి 19) నుంచి సీతా పయనం సినిమాను ఓటీటీలోకి తీసుకురానున్నట్లు సన్ నెక్ట్స్ ప్రకటించింది. అంటే ఇవాళ్టి అర్ధరాత్రి నుంచే ఈ కొత్త సినిమా ఓటీటీలోకి రానుందన్నమాట. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక అనౌన్స్ మెంట్ వీడియోను రిలీజ్ చేసింది సన్ నెక్ట్స్. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సీతా పయనం మూవీ స్ట్రీమింగ్ కు అందుబాటులోకి రానుంది. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై అర్జున్ స్వయంగా ఈ సినిమాను నిర్మించడం విశేషం. అలాగే టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఈ సినిమాకు స్వరాలు అందించడం విశేషం. మరి ఈ సీతా పయనం సినిమాను థియేటర్లలో మిస్ అయ్యారా? అయితే ఎంచెక్కా ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయండి.

### తస్సాదియ్యా.. గత్తరలేపిన దెయ్యం పిల్ల.. అప్పుడు భయపెట్టింది..

# ఇప్పుడు గ్లామర్‌తో చంపేస్తూ..



ఒకే ఒక్క హారర్ సినిమాతో తెలుగు సినీరంగంలో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఈ అమ్మడు. దెయ్యం పట్టిన అమ్మాయిగా తన అద్భుతమైన నటనతో అందరిని కట్టిపడేసింది. కానీ ఆ సినిమా తర్వాత ఆశించిన స్థాయిలో అవకాశాలు అందుకోలేకపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ నిత్యం గ్లామరస్ ఫోటోస్ షేర్ చేస్తుంది ఈ ముద్దుగుమ్మ. పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడు ఎవరో తెలుసా..? తెలుగు ప్రేక్షకులకు ఇష్టమైన అమ్మాయి. ఒక్క హారర్ సినిమాతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. దెయ్యం పట్టిన అమ్మాయిగా నటించి అందరిని ఆశ్చర్యపరిచింది. ఇప్పటికీ ఆమెను దెయ్యం పట్టిన అమ్మాయిగానే గుర్తుపడతారంటే తన నటనతో ఏ స్థాయిలో ఆకట్టుకుందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటుంది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ బాంధవి శ్రీధర్. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు తన అందాలతో కుర్రాళ్లను పిచ్చెక్కిస్తోంది. ఇప్పుడిప్పుడే వరుస ఫోటోషూట్లతో కట్టిపడేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. తెలుగులో మసూధ సినిమాతో ఈ అమ్మడు విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. 2022లో విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో అటు బాంధవి పేరు సైతం ఇండస్ట్రీలో మారుమోగింది. తెలుగులో వచ్చిన బెస్ట్ హార్రర్ చిత్రాల్లో ఇదొకటి. మసూద సినిమాలో సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ కీలకపాత్రల్లో నటించగా.. దెయ్యం పట్టిన అమ్మాయి పాత్రలో బాంధవి శ్రీధర్ తనదైన నటనతో ఆకట్టుకుంది. అయితే మసూధ తర్వాత బాంధవికి గుర్తింపు వచ్చింది కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రాలేదు. ఇటీవలే రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది చిత్రంలో జాన్వీ కపూర్ డూప్‌గా నటించిందట. జాన్వీ కపూర్ హైట్ 5 అడుగుల 4 అంగుళాలు. బాంధవి కూడా సేమ్ హైట్ ఉండటంతో ఈ బ్యూటీని డూప్ గా తీసుకున్నారని సమాచారం. బాంధవి శ్రీధర్‌కు సోషల్ మీడియాలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె నిత్యం ఫోటోస్, వీడియోస్, రీల్స్ షేర్ చేస్తూ నెటిజన్లతో ఇంట్రాక్ట్ అవుతుంటుంది. అలాగే ఇటీవలే పెద్ది సినిమాలోని చికిరి చికిరి పాటకు హుషారుగా స్టెప్పులేసింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతుంది. మరోవైపు గ్లామరస్ ఫోటోలతో కట్టిపడేస్తుంది ఈ వయ్యారి.

# రూ. 11.75 కోట్ల జీతం..

## కట్ చేస్తే.. ఐపీఎల్‌లో ఒక్క సిక్స్ కొట్టని తోపు ప్లేయర్లు..!



ఐపీఎల్ అంటే సిక్సుల పండుగ. కానీ ఆశ్చర్యకరంగా, కొన్ని ప్రముఖ ఆటగాళ్లు ఇప్పటివరకు ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. అందులో ఓ స్టార్ ప్లేయర్ భారీ జీతం తీసుకున్నప్పటికీ సిక్స్ నమోదు చేయలేకపోయాడు. ఐపీఎల్ 2026 ముందు ఈ ఆసక్తికర గణాంకాలు క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాయి.

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సాధారణంగా ప్రతి మ్యాచ్‌లో భారీ సిక్సులు కనిపిస్తాయి. రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీ, ఆండ్రూ రస్సెల్ వంటి ఆటగాళ్లు సిక్సుల వర్షం కురిపిస్తుంటారు. అయితే, కొందరు ఆటగాళ్లు మాత్రం తమ ఐపీఎల్ కెరీర్‌లో ఒక్క సిక్స్ కూడా నమోదు చేయలేకపోయారు. ఈ జాబితాలో మొత్తం నాలుగు మంది ప్రముఖ ఆటగాళ్లు ఉన్నారు. వారిలో ముగ్గురు ఆస్ట్రేలియా క్రికెటర్లు కావడం విశేషం.

**మిచెల్ స్టార్క్ - ఒక్క సిక్స్ లేదు..!**

ఈ జాబితాలో ప్రముఖ పేరు మిచెల్ స్టార్క్. ఈ ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ ఐపీఎల్‌లో 52 మ్యాచ్‌లు ఆడాడు.

**పరుగులు:** 111, ఫోర్లు: 11, స్ట్రైక్ రేట్: 93.27, అతను అంతర్జాతీయ క్రికెట్‌లో భారీ సిక్సులు కొట్టినప్పటికీ, ఐపీఎల్‌లో మాత్రం ఒక్క సిక్స్ కూడా నమోదు చేయలేదు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం.

ఈ ఆటగాళ్లు కూడా ఐపీఎల్‌లో సిక్సర్లు కొట్టలేదు..

ఐపీఎల్ 2012లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడిన వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ నితిన్ సైని కూడా ఐపీఎల్‌లో ఎప్పుడూ సిక్స్ కొట్టలేదు. అతను 10 మ్యాచ్‌లలో 140 పరుగులు చేసినప్పటికీ, ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ కూడా ఐపీఎల్‌లో ఎప్పుడూ సిక్స్ కొట్టలేదు. అతను 2012లో పూణే వారియర్స్ తరపున ఆడి, ఆరు ఇన్నింగ్స్‌లలో 98 పరుగులు చేశాడు. అతను ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయాడు. ఆ తర్వాత అతని ఐపీఎల్ కెరీర్ ముగిసింది. పూణే వారియర్స్‌కు చెందిన మరో ఆటగాడు, క్యాలమ్ ఫెర్గూసన్ కూడా ఐపీఎల్‌లో తొమ్మిది మ్యాచ్‌లు ఆడి ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. ఈ ఆస్ట్రేలియా బ్యాట్స్ మాన్ ఐపీఎల్‌లో 98 పరుగులు చేయగా, అతని స్ట్రైక్ రేట్ 83గా ఉంది. ఇది వన్డే క్రికెట్‌లో కూడా చాలా తక్కువ. ఆస్ట్రేలియా మాజీ ఆల్-రౌండర్ లీ ఆండ్రూ కార్సెల్లైన్ కూడా రాజస్థాన్ రాయల్స్ తరపున ఐదు మ్యాచ్‌లలో 81 పరుగులు చేసినప్పటికీ, ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు.

**భారీ జీతం - కానీ సిక్స్ లేదు..!**

ఈ జాబితాలో ఉన్న ఆటగాళ్లలో ఒకరు భారీగా రూ. 11.75 కోట్ల జీతం తీసుకున్నప్పటికీ, ఐపీఎల్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది ఐపీఎల్‌లో గణాంకాల వైవిధ్యాన్ని చూపిస్తుంది.

**ఐపీఎల్ 2026లో మారుతుందా ఈ రికార్డ్?**

మార్చి 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ 2026లో ఈ రికార్డులు మారుతాయా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. కొత్త సీజన్‌లో ఆటగాళ్లు తమ గణాంకాలను మెరుగుపరుచుకునే అవకాశముంది.

# ధోనీ, రోహిత్ కాదు..! ఐపీఎల్‌లో బెస్ట్ కెప్టెన్ రికార్డ్ ఎవరిదో తెలుసా..?

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లు అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ. కానీ ఆశ్చర్యకరంగా, బెస్ట్ విన్నింగ్ పర్సెంటేజ్ మాత్రం వీరిద్దరికీ కాదు. ఆ రికార్డు లిస్ట్ లో వేరే కెప్టెన్ ఉన్నాడండోయ్. ఐపీఎల్ 2026 ముందు ఈ విషయం ఆసక్తికర చర్చకు దారితీసింది. ఐపీఎల్‌లో 5 సార్లు ట్రోఫీలు గెలిచిన ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మలను అత్యుత్తమ కెప్టెన్లుగా భావిస్తారు. అయితే, గెలుపు శాతం (ఔఱఅఅఱఅఅస్త్ర ్రావతీఎవత్ఖుస్త్రవ) పరంగా చూస్తే, వీరిద్దరికంటే ముందున్నాడు పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్. అయ్యర్ మూడు జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించి, వాటితో ఫైనల్‌కు చేరడం విశేషం. అతని నాయకత్వం వల్ల ప్రతి జట్టులోనూ విజయాలు సాధ్యమయ్యాయి.



**శ్రేయస్ అయ్యర్ అద్భుత గణాంకాలు..**

ఐపీఎల్‌లో కనీసం 50 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన వారిలో శ్రేయస్ అయ్యర్ టాప్‌లో ఉన్నాడు.

మొత్తం మ్యాచ్‌లు: 87, విజయాలు: 50, ఓటములు: 35, ఫలితం రాలేదు: 2, విన్నింగ్ పర్సెంటేజ్: 58.82%

ఇదే శాతం సచిన్ టెండూల్కర్‌కూ ఉన్నప్పటికీ, ఆయన కేవలం 51 మ్యాచ్‌లకే కెప్టెన్‌గా ఉన్నారు.

**ఇతర టాప్ కెప్టెన్లతో పోలిస్తే..**

ఎంఎస్ ధోనీ - 58.36%, షేన్ వార్న్ - 56.36%, రోహిత్ శర్మ - 56.32%

ఈ గణాంకాలు చూపిస్తున్నాయి శ్రేయాస్ అయ్యర్ గెలుపు శాతం పరంగా ఎంత ముందున్నాడో చెబుతోంది.

**ఐపీఎల్ 2026లో అయ్యర్ లక్ష్యం..**

మార్చి 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ 2026లో శ్రేయస్ అయ్యర్ తన రికార్డును మరింత మెరుగుపర్చుకోవాలని చూస్తున్నాడు. పంజాబ్ కింగ్స్ తొలి మ్యాచ్ మార్చి 31న గుజరాత్ టైటాన్స్‌తో జరగనుంది. గత సీజన్‌లో పంజాబ్ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన అయ్యర్, టైటిల్ మాత్రం చేజార్చుకున్నాడు. అంతకుముందు ఢిల్లీ క్యాపిటల్స్‌ను 2020 ఫైనల్‌కు తీసుకెళ్లి, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో 2024లో టైటిల్ గెలిచాడు.

**ఈసారి టైటిల్ సాధిస్తాడా?**

ఈసారి పంజాబ్ కింగ్స్‌కు తొలి టైటిల్ అందించడమే అయ్యర్ లక్ష్యం. అతని కెప్టెన్సీ రికార్డ్ చూస్తే, ఈసారి కూడా జట్టును విజయవంతంగా నడిపించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com